మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 23 సోమవారం | సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 07

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033

శ్రీలంక అధ్యక్ష పీఠంపై మార్క్సిస్టు నేత దిసనాయకే

- అధ్యక్ష ఎన్నికల త్రిముఖ పోరులో చివరకు మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకే పైచేయి
- రాజపక్స కుటుంబం అవినీతి పాలనకు విసిగిపోయిన ప్రజలు.. మార్క్సిస్టు విధానాల వైపు మొగ్గు
- అవినీతిపై పోరాటమే ప్రచార అస్త్రంగా చేసుకొని 50శాతానికి పైగా ఓట్లు సాధించిన దిసనాయకే

2

కోలంబో-నవభూమిబ్యూరో
తీవ్ర ఆర్థిక సంక్షోభంతో దివాలా అంచున ఉన్న శ్రీలంకలో అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. ఉత్కంఠగా సాగిన అధ్యక్ష ఎన్నికల త్రిముఖ పోరులో చివరకు మార్క్సిస్టు నేత అనుర కుమార దిసనాయకే పైచేయి సాధించారు. రాజపక్స కుటుంబం అవినీతి పాలనకు విసిగిపోయిన ప్రజలు.. మార్క్సిస్టు విధానాల వైపు మొగ్గు చూపే దిసనాయకేను తమ దేశాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గత ఎన్నికల్లో కేవలం 3శాతం ఓట్లు మాత్రమే సాధించిన ఆయన.. ఈసారి ఎన్నికల్లో అవినీతిపై పోరాటమే ప్రచార అస్త్రంగా చేసుకొని 50శాతా నికి పైగా ఓట్లు సాధించి సంచలన విజయం సాధిం చారు.

ఎవరీ దిసనాయకే..?
విద్యార్థి నేతగా మొదలై.. దేశాధినేత వరకు ఎదిగిన దిసనాయకే శ్రీలంక రాజకీయాల్లో ఓ సంచలనం! 1968 నవంబర్ 24న కొలంబోకు 100 కి.మీల దూరంలో ఉన్న తంబుట్టెగామలో కార్మిక కుటుంబంలో ఆయన జన్మించారు. స్థానికంగానే పాఠశాల విద్యనభ్యసించిన

ఒంటరినైపోయాను..!

- ఇండియా కూటమి మద్దతు దక్కని జగన్?
- ఎన్నడూ లేనంతగా రాజకీయ ఆత్మ రక్షణ స్థితిలోకి
- చంద్రబాబు చాణిక్యంలో దిక్కుతోచని స్థితిలో జగన్
- ఏపీలో బీజేపీ నేతలు జగన్‌పై గరం..గరం..
- తన తప్పేమీ లేదని మోదీకి జగన్ లేఖ

2

అమరావతి-నవభూమిబ్యూరో
జగన్ ఎన్నడూ లేనంతగా రాజకీయ ఆత్మ రక్షణ స్థితిలోకి వెళ్ళారు. చంద్రబాబు ఎంతటి చాణక్యుడో వైసీపీకి తెలిసి వచ్చింది అని చెప్పాలి. జగన్ ఎన్నడూ లేనంతగా రాజకీయ ఆత్మ రక్షణ స్థితిలోకి వెళ్ళారు. చంద్రబాబు ఎంతటి చాణక్యుడో వైసీపీకి తెలిసి వచ్చింది అని చెప్పాలి. ప్రతీ దానికీ జగనే కారకుడు అంటూ మూడు నెలలుగ తెగ విమర్శలు చేస్తూ వచ్చిన చంద్రబాబు అత్యంత సున్నితమైన అంశంగా ఉన్న శ్రీ వారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని చేసిన ఆరోపణలతో వైసీపీ షేక్ అయిపోయింది. దాని నుంచి ఎలా బయటపడాలో కూడా అర్థం కాని పరిస్థితి. వైసీపీ ఇలా పవిత్రమైన తిరుమలలో అపచారం చేసిందని టీడీపీ కూటమి ఒంటి కాలి మీద దండెత్తి వస్తూంటే జగన్ తప్ప మరొకరు ఎవరూ జవాబు చెప్పేందుకు లేకపోవడం విచిత్రమే. జగన్ ఏరి కోరి నియమించిన మాజీ టీటీడీ అధికారి ధర్మారెడ్డి ఎక్కడ ఉన్నారో తెలియదు. అలాగే మొదటి రెండు రోజులు మీడియా ముందుకు వచ్చిన వైవీ సుబ్బారెడ్డి కూడా సైలెంట్ అయ్యారు. మొత్తం వ్యవహారం జగన్ కే ఉచ్చు బిగిస్తోంది. ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించినది. ఇందులో నిజానిజాల వరకూ ఎవరూ ఆగరు. జరిగింది తప్పు అనే అంటున్నారు దాంతో వైసీపీకి ఏమి పాలు పోక చివరికి ఎన్డీయే కూటమినే ఆశ్రయించింది. ప్రధాని నరేంద్ర మోడీకి లేఖను జగన్ రాయడం అందులో భాగమే అని అంటున్నారు. ఆ లేఖలో వాస్తవాలను బయటపెట్టాలని జగన్ కోరారు. అయితే బీజేపీకి చెందిన యువజన విభాగం బీజేవైఎం జగన్ ఇంటి ముందు ఆందోళన నిర్వహించింది. బీజేపీ నేతలు అంతా పెద్ద ఎత్తున జగన్ మీద విరుచుకు పడుతున్నారు చరిత్రలో తొలిసారి.. ఏపీలో చూస్తే కమలనాథులు గరం గరం అవుతున్నారు. మరి అదే పార్టీకి చెందిన మోడీ ఏ విధంగా వాస్తవాలు బయటకు తెస్తారు అని జగన్ అనుకుంటున్నారో అర్థం కానిదే అంటున్నారు ఈ సమయంలో ఇండియా కూటమి నుంచి వైసీపీకి మద్దతు ఏదీ లభించడంలేదు. కేవలం తృణమూల్ కాంగ్రెస్ నుంచే లభించింది. అద్ని కూడా ఆ పార్టీ ఎంపీ సాకెత్ గోఖలే మాత్రం తిరుమల లడ్డూ

ప్రజల్లో ఉన్న వారికే పదవులు

- టీపీసీసీ నాయకత్వానికి సీఎం రేవంత్ సూచన
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందే
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్-నవభూమిబ్యూరో: ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. ఎనిమిది లోక్‌సభ సీట్లు గెలిచాం. మహేష్ కుమార్ గౌడ్‌ను రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచిస్తున్నా. పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చాం. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయి. ప్రధానిని ఓడించాల్సిన తరుణంలో మహేష్ కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. బీసీ కులగణన చేయాలన్నది రాహుల్‌గాంధీ బలమైన ఆలోచన. రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పాటు చేశాం. సుప్రీం తీర్పును అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే మోదీ జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. జమిలి ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి. తొమ్మిది నెలల్లో ఒక్కరోజు కూడా నేను సెలవు తీసుకోలేదు. ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో రూ.18వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదు. రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యం. ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నం. రాష్ట్రంలో ప్రతిఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తాం. అధికారం కోల్పోయి ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది. ఇన్‌ఛార్జ్ మంత్రులు వారానికి రెండుసార్లు జిల్లాల్లో పర్యటించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు

- కష్టపడ్డ నేతలకే ప్రాధాన్యం: సీఎం చంద్రబాబు
- 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమంటున్న ప్రజలు
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి పార్టీ శ్రేణులు తీసుకెళ్లాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, గ్రామస్థాయి పార్టీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

2

అమరావతి-నవభూమిబ్యూరో: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, వారి త్యాగాలను మర్చిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ చేపడతామని తెలిపారు.
మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, గ్రామస్థాయి పార్టీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు అంటున్నారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి.. ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని నేతలకు సూచించారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు వినియోగించి ప్రజల మనోభావాలు దెబ్బతీసిందని, దోషులను వదిలిపెట్టమని హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ..వ్యవస్థలను చక్కబెతు న్నట్లు చంద్రబాబు చెప్పారు.
"ప్రజల సెంటిమెంట్‌తోనూ ఆడుకునే స్థాయికి వైకాపా దిగజారింది. నేరం చేయడం, తప్పించుకోవడానికి ఎదురుదాడి చేయడం వారికి అలవాటుగా మారింది. ఇలానే వదిలేస్తే అబద్ధాలను పదేపదే చెప్పి ప్రజలను మోసం

ఆగని హైడ్రా కూల్చివేతలు

- 8 ఎకరాల భూమి స్వాధీనం.. కూల్చివేతలపై హైడ్రా ప్రకటన
- కేవలం వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేత
- కూకట్‌పల్లి నల్లచెరువులో అనధికార షెడ్ల కూల్చివేత
- అమీన్‌పూర్ మండలంలోనూ ఆక్రమణల తొలగింపు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో: హెచ్ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో ఆదివారం కూల్చివేతలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేవలం వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేసినట్లు పేర్కొంది.
కూకట్‌పల్లి నల్లచెరువులో అనధికార షెడ్లను కూల్చివేసినట్లు తెలిపింది. " నల్లచెరువులోని సర్వే నంబర్ 66, 67, 68, 69లోని మొత్తం 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీ గోడలు కూల్చాం. నాలుగు ఎకరాల భూమి స్వాధీనం చేసుకున్నాం" అని హైడ్రా అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోనూ ఆక్రమణలను కూల్చివేసినట్లు హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాలను కూల్చివేసినట్లు చెప్పారు.
" కిష్టారెడ్డిపేటలోని సర్వేనంబర్ 164లో 3 భవనాలు కూల్చేశాం. వాణిజ్యపరంగా వినియోగిస్తున్న ఐదంతస్తుల భవనాన్ని కూల్చేశాం. ఒక ఎకరం ప్రభుత్వం స్థలం స్వాధీనం చేసుకున్నాం. పటేల్‌గూడలో 25 అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. సర్వేనంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాలను కూల్చివేశాం. 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నాం" అని హైడ్రా అధికారులు వెల్లడించారు.

రంగంలోకి సిట్

- తిరుపతి లడ్డూ కల్తీ ఘటన విచారణకు సిట్ ఏర్పాటు
- తిరుమల లడ్డూ కల్తీ ఘటనపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఐజీ ర్యాంక్ స్థాయి అధికారితో ఏర్పాటు కానున్న సిట్..
- లడ్డూ అపవిత్రానికి గల కారణాలపై లోతుగా దర్యాప్తు
- తిరుమలలో అధికార దుర్వినియోగంపై కూడా విచారణ

2

అమరావతి-నవభూమిబ్యూరో: కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
ఈ నేపథ్యంలో తిరుపతి లడ్డూ కల్తీ ఘటనపై చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ అపవిత్రం కావడంపై విచారణ చేపట్టేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసింది.
ఐజీ ర్యాంక్ స్థాయి అధికారితో ఏర్పాటు కానున్న సిట్.. లడ్డూ అపవిత్రానికి గల కారణాలపై లోతుగా దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. తిరుమలలో అధికార దుర్వినియోగంపైన సిట్ విచారణ చేపట్టనుంది. లడ్డూ కల్తీపై సిట్ నివేదిక ఆధారంగా నిందితులపై సీరియస్ యాక్షన్ తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. టెంపుల్ పవిత్రతను కాపాడటం తమ బాధ్యత అని.. నిందితులను వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.
మరోవైపు తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ కావడంతో టీడీపీ కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ ప్రసాదం అపవిత్రంపై రేపు (సెప్టెంబర్ 23) తిరుమలలో శాంతియాగం నిర్వహించనుంది. సోమవారం ఉదయం ఆరు గంటల నుండి శాంతియాగం ప్రారంభం

హెచ్చరికలు లేకుండా మూసీ గేట్లు ఎత్తివేత

- వరదలో చిక్కుకున్న కాపర్లు, 20 గేదెలు గల్లంతు

హైదరాబాద్-నవభూమి బ్యూరో: మూసీ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగా 20 గేదెలు వరద నీటిలో కొట్టుకుపోగా.. పలువురు కాపర్లు వరదలో చిక్కుకుపోయారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా అధికారులు గేట్లు తెరవడంతో ఒక్కసారిగా నీరు చుట్టుముట్టింది. దీంతో వరద మధ్యలోనే పశువుల కాపర్లు చిక్కుకున్నారు. మరోవైపు, 20 వరకు గేదెలు వరదలో కొట్టుకుపోయాయి. కేతపల్లి మండలం భీమారం గ్రామంలోని మూసీ నదిలోకి ఒక్కసారిగా వరద రావడంతో ఓ ట్రాక్టర్ కూడా కొట్టుకుపోయింది. తమను కాపాడాలంటూ ఆర్తనాదాలు చేస్తున్న పశువుల కాపర్లను గమనించిన స్థానికులు వెంటనే - మిగతా 2లో

చిరుకు గిన్నిస్ సత్కారం

- చిరంజీవికి విశిష్ట గౌరవం.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు
- 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించిన చిరు
- బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్.చిరంజీవికి గిన్నిస్ అవార్డు ప్రదానం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో: నాలుగు దశాబ్దాలకుపైగా సినీ ప్రస్థానంలో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి
సినీ పరిశ్రమకు చేసిన సేవలకు గానూ ఇటీవల పద్మవిభూషణ్ అవార్డును సొంతం చేసుకున్న ఆయన తాజాగా మరో విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీతోపాటు నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, జెమిని కిరణ్, మైత్రి రవిశంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, కేఎస్ రామారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిరంజీవికి అభినందనలు తెలిపారు. చిరుతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.
'పునాదిరాళ్ళు' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు చిరంజీవి. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు, అవమానాలు ఎదుర్కొని.. స్టార్ హీరోగా ఎదిగారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని

జలపాతంలో ముగ్గురు వైద్యవిద్యార్థుల గల్లంతు

అల్లూరి-నవభూమిబ్యూరో: అల్లూరి జిల్లా జలతరంగిణి జలపాతం వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ముగ్గురు ఎంబీబీఎస్ విద్యార్థులు గల్లంతయ్యారు. ప్రమాదవశాత్తు జలపాతంలో ఐదుగురు కొట్టుకుపోగా..స్థానికులు ఇద్దర్ని కాపాడారు. మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో ఇద్దరు యువతులు, యువకుడు ఉన్నారు. మొత్తం 14 మంది వైద్య విద్యార్థులు ఏలూరు నుంచి విహార యాత్రకు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.



నాలుగు రోజులు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

హైదరాబాద్-నవభూమి తెలంగాణలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 10 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

మేడిగడ్డ బరాజ్‌కు పెరిగిన వరద

మహదేవపూర్-నవభూమి కొద్ది రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మేడిగడ్డ బరాజ్‌కు వరద తగ్గింది. కాగా, ఎగువన కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌కు వరద స్వల్పంగా పెరిగింది. ఆదివారం 1,06,640 క్యూసెక్యుల ప్రవాహం రాగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత ప్రవాహం రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 90.20 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది.

మల్లన్న దర్శనం.. భక్తుల పరవశం

చేర్యాల-నవభూమి : రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో(నందడిగా మారింది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన శివ నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. స్వామి వారి ఉత్సవాలు ముగిసినప్పటికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 15వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశ తెలిపారు.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు, కోడెల స్థంబం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు.

పోచారంలో భారీ చోరీ.. 2.2 కోట్లు, 28 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు

హైదరాబాద్-నవభూమి మేడ్చల్ జిల్లా పోచారం ఐటీకారిడార్ ఠానా

పరిధిలో భారీ చోరీ జరిగింది. చౌదరిగూడలోని మక్త గ్రామంలో నాగభూషణం అనే వ్యక్తికి చెందిన ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలో దాచిన రూ.2.2 కోట్లతో పాటు 28 తులాలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

కాగా, శంకర్‌పల్లిలో తన 10 ఎకరాల భూమి అమ్మడానికి నాగభూషణం ఒప్పందం చేసుకున్నాడని, అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఇది తెలిసినవారు చేసిన పనేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యం నాగభూషణం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు.. ఉగ్రవాదిని వెంటబెట్టుకొని వచ్చి..!

హైదరాబాద్-నవభూమి జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ఆదివారం హైదరాబాద్‌లో తనిఖీలు చేపట్టారు. సైదాబాద్ శంఖేశ్వర్ బజార్ గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు గంటపాటు సోదాలు నిర్వహించనట్లు తెలుస్తున్నది. ఆగస్టులో ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్‌ను ఎన్ఐఏ అరెస్టు చేసింది. అతనికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో సంబంధం ఉన్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా గుర్తించింది. రిజ్వాన్ అబ్దుల్ ఐసిస్ తరఫున పుణే నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడని తేలింది. అతన్ని ఢిల్లీలోని గంగాబక్ష్ మార్గ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.అరెస్ట్ సమయంలో రిజ్వాన్ నుంచి 30 బోర్ పిస్టల్, 3 కాట్రిడ్జ్‌లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత రిజ్వాన్‌పై ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే రిజ్వాన్ తలపై రూ.3లక్షల రివార్డు ఉన్నది. అరెస్టు అనంతరం ఎన్ఐఏ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టింది. రిజ్వాన్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే హైదరాబాద్‌లో ఎన్ఐఏ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తున్నది. సైదాబాద్ శంఖేశ్వర్ గ్రీన్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో రిజ్వాన్ కొద్దినెలలు ఉన్నాడని ఎన్ఐఏ విచారణలో తేలింది. ఈ క్రమంలో అతన్ని తీసుకొని వచ్చి సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

సిరిసిల్ల జిల్లాలో నాటు బాంబుల తయారీదారు అరెస్ట్

హైదరాబాద్-నవభూమి : నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితోపాటు జంతువులు, వన్యప్రాణులను వేటాడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 24 గంటలు గడువక ముందే పోలీసులు కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా(కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ముడికె మల్లేశం అనే రైతుకు చెందిన బర్రె నాటు బాంబు కొరుకగా అది పేలడంతో ప్రాణాలు కోల్పోయింది. దీంతో సదరు వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అదే గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా నాటు బాంబులను తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. ఇటీవల సిరిసిల్ల రూరల్ మండలం చిన్న బోనాలకు చెందిన పడిగె లస్మయ్య, తుమ్మల కనుకరాజు, సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్య అతని వద్ద నాటు బాంబులు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వీరంతా వారివారి అటవీ ప్రాంతాల్లో నాటుబాంబులను గొర్రె పేగులకు చుట్టి జంతువులకు ఎరవేసి ఉంచుతున్నారు. దీంతో అటవీ జంతువులు వాటిని కొరికితే పేలడంతో అక్కడివక్కడే మృతి చెందగా, వాటి ద్వారా వచ్చే మాంసాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు.ఇటీవల సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్య పల్లిపిండిలో నాటుబాంబును ఉంచి ధర్మారం శివారులో ఎరవేసి ఉంచాడు. ఈ క్రమంలో అటుగా వెళ్లిన ముడికె మల్లేశం బర్రె బాంబును కొరికి మృతిచెందింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా రాజలింగం వద్ద 7 నాటుబాంబులు, తయారు చేసే గన్ పౌడర్, రూ.2 వేలు, పడిగె లస్మయ్య వద్ద 10 నాటు బాంబులు, తుమ్మల కనుకరాజు వద్ద 10 నాటుబాంబులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై బీఎన్ఎస్, ఎక్స్‌ప్లోజివ్స్, వన్యప్రాణుల చట్టం ప్రకారం కేసు నమోదు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే, సిరిసిల్ల పోలీసులు సర్దాపూర్‌కు చెందిన మొగిలి అంజయ్యను పట్టుకుని 40 నాటు బాంబులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పదేళ్లు కవిత ఏం చేసిందో బయటపెడతాం..

యాదాద్రి -నవభూమి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏం చేసిందో బయటపెడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ చిన్న పిల్లోడు కాదని... ఆయన ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. కేటీఆర్ దగ్గర ఆధారాలు ఉంటే పేపర్ పట్టుకుని రావాలని మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు. ఇవాళ(ఆదివారం) గాంధీభవన్‌లో మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ, కేటీఆర్ కుటుంబంపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష నాయకుడు హోదా తనకు వద్దని కేసీఆర్ అంటున్నారు. అది హరీష్‌రావుకు పోతుందేమో అని కేటీఆర్ బయపడుతున్నారు. కేటీఆర్ దోపిడీ వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాకముందే టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు టెండర్లు పిలిచారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

సత్యం రామలింగరాజు కొడుకు కేటీఆర్ రైట్ హ్యాండ్ అని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రోజురోజుకూ బీఆర్ఎస్ పార్టీ ప్రభావం కోల్పోతోందన్నారు. ఆ పార్టీకి ప్రతిపక్ష నాయకుడు ఎవరో కూడా తెలియదని చెప్పారు. ఎమ్మెల్యేలు , మున్సిపల్ చైర్మన్లు పార్టీ వదిలిపెట్టి పోతుండటంతో దిక్కుతోచని స్థితిలో కేటీఆర్ మాట్లాడుతున్నారని చెప్పారు. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా పని చేసి రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేసి అందులో రూ. 2 లక్షల కోట్లు ఆయన కుటుంబం దోచుకుందని మంత్రి కోమటిరెడ్డి విమర్శలు చేశారు.రూ. 8888 వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయో కేటీఆర్ లెక్కలు చెప్పాలని అడిగారు. కాళేశ్వరం స్కామ్ చేశారు, మేడిగడ్డ కూలిపోయింది ఎప్పుడు ఎవరు జైలుకు పోతారో తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉన్న ప్రభాకర్ రావును అమెరికా నుంచి రావద్దని కేటీఆర్ ,హరీష్ రావు అమెరికాకు పోయి చెప్పి వచ్చారని ఆరోపించారు. ప్రభాకర్ రావు వస్తే వీరు జైలుకు పోతారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ దుకాణం బంద్ అవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్ నీకు దమ్ముంటే రుజువు చేయి..దానికైనా మేము సిద్ధం' అని మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు."నీకు, మీ బావకు ఉన్న పంచాయితీల వల్ల కేసీఆర్ ఫ్రస్ట్రేషన్ అవుతున్నాడు. మంచి పనులు చేసినా.. నీకు దోపీడే కనిపిస్తోం ది..మీ కుటుంబంలాగా మేం దోచుకోలేదు. మీ పాలనలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి.. మేము ఒక్కటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక స్థానం కూడా రాదు. మీ పార్టీ ఎక్కడిది ప్రతిపక్ష నాయకుడు మీ నాయనా లేక హరీష్‌రావా, మీ చెల్లెలా , నువ్వా.. కేటీఆర్ ముందు ఆ విషయం తేల్చుకో. మీరు నలుగురు కలిసి ప్రతిపక్ష నేత పాత్ర కోసం పోటీ పడుతున్నారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సెటైర్లు గుప్పించారు.

రంగంలోకి సిట్

(1వపేజీ తరువాయి)కానుండగా.. విమాన ప్రకారం దగ్గర యాగశాలలో శాంతియాగానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. శాంతియాగం ముగిసిన తర్వాత అర్చకులు పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు. ఇందు కోసం మొత్తం మూడు హెూమ గుండాలు ఏర్పాటు చేశారు. ఈ శాంతియాగంలో 8 మంది అర్చకులు, ముగ్గురు ఆగమ సలహాదారులు పాల్గొననున్నారు.

లడ్డులో జంతువు కొవ్వు కలిపారా లేదా.. విచారణ చేయాలని సుప్రీంలో పిటిషన్..

ఇప్పుడు తిరుమల శ్రీవారి లడ్డూపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. సామాన్య భక్తుడి నుంచి వీఐపీల వరకు తిరుమల లడ్డూలో నిజంగానే జంతువు కొవ్వు కలిసిందా అని చర్చించుకుంటున్నారు.

ఈ విషయమై భక్తులు టీటీడీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లడ్డూలో నిజంగానే జంతువు కొవ్వు కలిపినట్లయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఈ విషయమై విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ

ఆచారం హిందూ మతపరమైన మనోభావాలను కించపరిచేలా ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. రైతు, హిందూ సేన అధ్యక్షుడు సుర్జిత్ సింగ్ యాదవ్ సుప్రీంలో పిటిషన్ వేశారు. సిట్ తో విచారణ జరిపించాలని కోరారు. తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించారనే ఆరోపణలు హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ వార్త చాలా మందిని బాధించాయని అన్నారు. అందరిని దృష్టిలో ఉంచుకుని పిటిషన్ వేసినట్లు వివరించారు.

కుర్చీలు విరగొట్టిన ఫ్యాన్స్... 'దేవర' ప్రీ రిలీజ్ క్యాన్సిల్

హైదరాబాద్-నవభూమి :'దేవర' ప్రీ రిలీజ్ ఈవెంట్ క్యాన్సిల్ అయింది. దీనికి ప్రధాన కారణం భారీ సంఖ్యలో వచ్చిన అభిమానుల అత్యుత్సాహం. త్వర త్వరగా స్టేజ్ దగ్గరకు చేరుకోవాలని హెూటల్ లోపలికి తోసుకుంటూ వెళ్లారు.

దాంతో అద్దాలు ధ్వంసం అయ్యాయి. నోవాటెల్ హెూటల్ ప్రాపర్టీస్ డామేజ్ అయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఈవెంట్ క్యాన్సిల్ చేయడం మినహా మరొక మార్గం లేకుండా పోయింది. అయితే... ఈ ఫంక్షన్ దగ్గర కొంత మంది అభిమానులు రచ్చ రచ్చ చేశారు.

క్యాన్సిల్ అని తెలిశాక కుర్చీలు విరగ్గొట్టారు!

'దేవర' ప్రీ రిలీజ్ ఫంక్షన్ క్యాన్సిల్ అని స్టేజి మీదకు వచ్చిన పోలీసులు అనౌన్స్ చేయడంతో పాటు బౌన్సర్స్ సహాయంతో హాల్ లోపల నుంచి ఓ అభిమాని తర్వాత మరొకరిని బయటకు పంపించారు. ఒక దశలో పోలీసులకు, అభిమానులకు మధ్యన ఘర్షణ పూరిత వాతావరణం కూడా ఏర్పడింది. పోలీసుల మీదకు కొందరు అభిమానులు దూసుకు వచ్చారని ప్రత్యక్షంగా చూసిన కొందరు చెబుతున్నారు.

మరికొందరు అయితే బయటకు వచ్చేటప్పుడు కుర్చీలను విసిరేస్తూ విరగకొట్టారు. ఈ పద్ధతి ఎంత మాత్రం మంచిది కాదని, ఎన్టీఆర్ అభిమానులకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ఉందని మరి కొంతమంది అభిమానులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

తెలంగాణలో 90 శాతం, యూపీలో 1.12 లక్షల మసీదులకు యాజమాన్య పత్రాల్లేవు!



హైదరాబాద్-నవభూమి :కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 90 శాతం మసీదులకు ఎలాంటి యాజమాన్యాన్ని రుజువు చేసే పత్రాలు లేవని తెలిపారు.

వక్ఫ్ బిల్లు సవరణ బిల్లు చట్టంగా మారితే మసీదులు, ఈద్గాలు, ఇతర ముస్లిం మత స్థలాలను లాక్కుంటారని అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఒక్కసారి ముస్లింలు ఒక స్థలాన్ని ప్రార్థనా స్థలంగా ఉపయోగించడం ప్రారంభిస్తే, ఆ స్థలం శాశ్వతంగా ముస్లింల ఆస్తిగా మారుతుందని, ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆ నిబంధనను మారుస్తోందన్నారు.

తెలంగాణలో 33 వేల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, అందులో 90% వాటికి భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలు లేవని అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. కొందరు మక్కా, మదీనా రిజిస్టర్డ్ డీడ్‌ను అడిగితే అందించగలరా? అని ప్రశ్నించారు. 300-400 సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ పత్రాలు లేనందున, ఈ మసీదులను ప్రభుత్వం లాక్కుంటుందని ఒవైసీ పేర్కొన్నారు.ఇప్పటికే ఒక బాబ్రీ మసీదును పోగొట్టుకున్నామని, ఇప్పుడు 90 శాతం మసీదులను కోల్పోతామని ఒవైసీ అన్నారు. ఖననం చేయబడిన దేవాలయాలను కనుగొనడానికి మసీదులను తవ్వాలని ఆర్ఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని ఒవైసీ చెప్పారు.ఇక, ఉత్తరప్రదేశ్‌లో 1.21 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, వాటిలో 1.12 లక్షలకు ఎలాంటి పత్రాలు లేవని అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. 'వాటి యాజమాన్యం లాక్కుంటే ఆస్తులను ఎవరు స్వాధీనం చేసుకుంటారు?' అని ఒవైసీ ప్రశ్నించారు. 'మీకు మసీదుపై ఎలాంటి చట్టపరమైన హక్కు ఉండదు, ఎవరైనా దానిని స్వాధీనం చేసుకోగలరు' ఒవైసీ పేర్కొన్నారు.

లడ్డూలో అంబర్ ప్యాకెట్

ఖమ్మం-నవభూమి: ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో తిరుపతి లడ్డూ మరోసారి అపవిత్రమైనట్లు వార్తలు వస్తున్నాయి.గొల్లగూడెం పంచాయతీ పరిధిలోని కార్తికేయ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న దొంతు పద్మావతి ఈ నెల 19న తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి వచ్చారు. తిరిగి వచ్చేటప్పుడు బంధువులు, ఇరుగు పొరుగు వారికి పంచేందుకు లడ్డూలు తీసుకొచ్చారు. ఆదివారం లడ్డూను పంచేందుకు కవర్ నుంచి లడ్డూలను బయటకు తీశారు. దీంతో లడ్డూలో అంబర్ ప్యాకెట్ కనిపించడంతో భక్తులు షాక్ కు గురయ్యారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

శ్రీలంక అధ్యక్ష పీఠంపై మార్క్సిస్టు నేత దిసనాయకే

(1వపేజీ తరువాయి)దిసనాయకే.. తమ గ్రామం నుంచి యూనివర్సిటీలో ప్రవేశం పొందిన తొలి విద్యార్థి కావడం విశేషం. తొలుత తాను పెరదేనియా విశ్వవిద్యాలయంలో చేరగా.. రాజకీయ సిద్ధాంతాల కారణంగా ఎదురైన బెదిరింపులతో కెలానియా విశ్వవిద్యాలయానికి బదిలీ అయినట్లు గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్న ఆయన.. ఆ తర్వాత సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చేరి విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు.

శ్రీలంక అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

1987లో మార్క్సిస్టు ప్రభావిత జనతా విముక్తి పెరమునాలో చేరిన దిసనాయకే.. తన రాజకీయ పునాది నిర్మించుకున్నారు. 1998 నాటికి జేవీపీ నిర్ణయాధికార విభాగం పొలిట్‌బ్యూరోలో చోటు దక్కించుకున్నారు. 2000లో ఎంపీ అయిన దిసనాయకే.. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేఎన్‌పీ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. చంద్రికా కుమారతుంగ ప్రభుత్వంలో ఆనాడు వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా సేవలందించారు. 2005లో సునామీ సహాయక సమన్వయం కోసం ప్రభుత్వం, ఎల్‌టీటీఈ మధ్య ఉమ్మడి ఒప్పందంపై అంగీకారం కుదరకపోవడంతో తలెత్తిన విభేదాలతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

అవినీతి వ్యతిరేక పోరాట గళం

శ్రీలంకలో 2022లో తలెత్తిన ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకొని సమర శంఖం పూరించారు. మార్పు, అవినీతి వ్యతిరేక సమాజ నిర్మాణం వంటి నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేసి అపూర్వ జనాదరణ పొందారు. వ్యవస్థాగత మార్పు కోసం నినదించారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాలను ఎత్తిచూపుతూనే.. జవాబుదారీతనం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఆర్థిక సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించడంలో గత పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపారు. అంతేకాకుండా తమ పార్టీ మ్యానిఫెస్టోలో విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేయడంతో పాటు అనేక ప్రజా సంక్షేమ విధానాలతో ప్రజల్ని తనవైపు ఆకట్టుకోవడంలో విజయవంతమయ్యారు. శ్రీలంక ఆర్థిక సంక్షోభం, రాజపక్స రాజీనామా వంటి పరిణామాలతో ఏర్పడిన నాయకత్వ శూన్యత, ప్రజల్లో నిరుత్సాహం కమ్ముకొని ఉన్న పరిస్థితుల్లో వ్యవస్థలో మార్పు రావాలని కోరుకుంటున్న యువతను.. అవినీతి వ్యతిరేక వైఖరితో ఆకట్టుకోవడంలో దిసనాయకే సఫలీకృతమయ్యారు.

హెచ్చరికలు లేకుండా మూసీ..

(1వపేజీ తరువాయి)పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన నల్గొండ డీఎస్పీ శివరామ్ రెడ్డి ఘటనా స్థలానికి హుటాహుటిన సిబ్బందిని పంపించారు.

వరద ప్రవాహంలో చిక్కుకుపోయిన పశువుల కాపర్లను జేసీబీ సాయంతో బయటకు తీసుకువచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకుండా మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసి వరదనీటిని వదలడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలో గేదెలు, ట్రాక్టర్ కొట్టుకుపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద రావడంతోనే మూసీ ప్రాజెక్టు అధికారులు గేట్లు ఎత్తివేసి నీటిని కిందికి వదిలినట్లు తెలుస్తోంది.

చిరుకు గిన్నిస్ సత్కారం

(1వపేజీ తరువాయి)సద్వినియోగం చేసుకుంటూ తనదైన నటన, డ్యాన్సులతో యువతను ఉర్రూతలూగించారు. బాక్సాఫీస్ రికార్డులు క్రియేట్ చేశారు. 9 ఫిలింఫేర్, 3 నంది అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. సినీ రంగానికి ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన ప్రభుత్వం 2006లో ఆయనకు పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అందించి గౌరవించింది. సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' కోసం వర్క్ చేస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది

ఒంటరినైపోయాను..!

(1వపేజీ తరువాయి)వివాదం ఫేక్ కావచ్చు అని అన్నారు. ఎందుకంటే కారణం చెబుతూ చంద్రబాబు కు ఉన్న హెరిటేజ్ సంస్థను ఆయన ఇందులోకి లాగారు. ఆ సంస్థ ప్రయోజనాల కోసమే ఇలా చేస్తున్నారు అని కూడా అన్నారు. హెరిటేజ్ షేర్లలో 1200 కోట్ల లాభం ఆ సంస్థకు వచ్చిందని అన్నారు. ఇక తిరుమల శ్రీవారి లడ్డూలో వాడిన నెయ్యి పైన అనుమానాలు ఉండడం అంటే ఆ ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబుకు డెయిరీ సామ్రాజ్యమే ఉందని ఆయన రెండింటికీ లింక్ పెట్టి వదిలారు. నిజానికి ఈ కోణంలో ఎవరూ రియాక్ట్ కాలేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ చేసిన ఈ కామెంట్స్ మాత్రమే వైసీపీకి కొంత మద్దతుగా ఉన్నాయి. కాంగ్రెస్ సహా అనేక పార్టీలు ఇది తప్పు అనే అంటున్నాయి. విచారణను కోరుతున్నాయి. ఇక రాహుల్ గాంధీ అయితే అధికారులు తప్పు చేసి ఉండొచ్చు అని అంటున్నారు. దానికి రాజకీయంగా ఆయన ఎక్కడా ముందుకు తేలేదు. అది ఒకింత ఊరట అనుకోవాలి. ఏది ఏమైనా తిరుమల శ్రీవారి లడ్డూ అంటేనే బలమైన సెంటిమెంట్. దాంతో హిందువుల మనోభావాలకు అనుగుణంగానే ఎవరైనా రియాక్టు కావాల్సిందే. అయితే వామపక్షాలు ఈ విషయంలో నిజాలు తేల్చమని అంటున్నాయి తప్ప రాజకీయ విమర్శలు చేయడం లేదు. మొత్తానికి చూస్తే మాత్రం ఇండియా కూటమి వైపు నుంచి వైసీపీకి మద్దతు అయితే దక్కడంలేదు. అదే సమయంలో ఎన్డీయేలో పెద్దన్న అయిన బీజేపీని వైసీపీ నిజాలు నిగ్గు తేల్చమని కోరడం అంటే రాజకీయంగా వైసీపీ వ్యూహం ఏమిటి అన్నది కూడా అర్థం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ సోమవారం 23, సెప్టెంబర్, 2024

మహిళా సహోద్యోగి, ఆమె పెరెంట్స్‌ను కత్తితో పొడిచిన వ్యక్తి

న్యూఢిల్లీ–నవభూమి: తనతో మాట్లాడకుండా దూరంగా ఉంటుందన్న కోపంతో మహిళా సహోద్యోగి, ఆమె పెరెంట్స్‌పై ఒక వ్యక్తి దాడి చేశాడు. కత్తితో వారిని పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆ ముగ్గురూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. రాజౌరి గార్డెన్ ప్రాంతంలోని ఓ సెలూన్‌లో 21 ఏళ్ల అభిషేక్, ఒక మహిళ పని చేస్తున్నారు. అయితే స్నేహితురాలైన ఆమె ఇటీవల అతడితో మాట్లాడకపోవడంతోపాటు దూరంగా ఉంటున్నది.కాగా, ఆ మహిళ తీరు పట్ల అభిషేక్ ఆగ్రహం చెందాడు. శనివారం ఉదయం 9 గంటలకు ఖ్యాలా ప్రాంతంలోని ఆమె ఇంటికి వెళ్లాడు.

వెంట తెచ్చిన కత్తితో ఆ మహిళపై దాడి చేసి పొడిచాడు. కుమార్తెను కాపాడుకునేందుకు ప్రయత్నించిన ఆమె తల్లిదండ్రులపై కూడా కత్తితో దాడి చేసి పారిపోయాడు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కత్తి పోటు వల్ల గాయపడిన మహిళ, ఆమె తల్లిదండ్రులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు.. అరవింద్ కేజ్రీవాల్ 5 ప్రశ్నలు

న్యూఢిల్లీ– నవభూమి: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్‌కు 5 ప్రశ్నలు సంధించారు. ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేసిన అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం జంతర్ మంతర్ వద్ద జరిగిన తొలి బహిరంగ సభ 'జనతా కీ అదాలత్'లో ప్రసంగించారు. ప్రధాని మోదీ పార్టీలను విచ్ఛిన్నం చేయడం, ప్రలోభపెట్టడం, ఈడీ లేదా సీబీఐతో బెదిరించడం ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వాలను పడగొట్టడం సరైనదేనా? అని మోహన్ భగవత్‌ను ప్రశ్నించారు. 'అత్యంత అవినీతి నాయకులను మోదీ తన పార్టీలో చేర్చుకున్నారు. వారిని అవినీతిపరులు అని స్వయంగా ఆయన పిలిచారు. అలాంటి రాజకీయాలను మీరు అంగీకరిస్తారా?' అని నిలదీశారు.కాగా, ఆర్ఎస్ఎస్ గర్భం నుంచి బీజేపీ పుట్టిందని, బీజేపీ దారితప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆర్ఎస్ఎస్‌పై ఉందని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అలాంటప్పుడు మోదీ తప్పుడు పనులు చేయకుండా మీరు ఎప్పుడైనా ఆపారా? అని మోహన్ భగవత్‌ను ప్రశ్నించారు. 'లోక్‌సభ ఎన్నికల సమయంలో తమకు ఆర్ఎస్ఎస్ అవసరం లేదని జేపీ నడ్డా అన్నారు. కొడుకు అంతగా ఎదిగిపోయాడా? మాతృసంస్థపై కొడుకు తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆయన అలా చెప్పినప్పుడు మీకు బాధ కలగలేదా?' అని నిలదీశారు. '75 ఏళ్ల తర్వాత నేతలు రిటైర్ అవుతారని మీరు (మోహన్ భగవత్) చట్టం చేశారు. మోదీకి ఈ రూల్ వర్తించదని అమిత్ షా చెబుతున్నారు. అద్వానీకి వర్తించేది మోదీకి ఎందుకు వర్తించదు?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు.మరోవైపు దేశానికి సేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని, అధికారం లేదా పదవిపై దురాశతో కాదని అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలతో బాధపడి సీఎం పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. గత పదేళ్లలో తాను సంపాదించింది డబ్బు కాదని, గౌరవం మాత్రమేనని అన్నారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు తనకు అగ్ని పరీక్ష అని తెలిపారు. తాను నిజాయితీపరుడు కాదని భావిస్తే ప్రజలు తనకు ఓటు వేయవద్దని అన్నారు.

తిరుమల లడ్డూ వివాదం.. స్పందించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్

న్యూఢిల్లీ–నవభూమి: తిరుమల శ్రీవారి ప్రసాదం అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంతో ఏపీలో రాజకీయాలు వేడెక్కాయి. తాజాగా ఈ అంశంపై ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ స్పందించారు. ఈ ఘటన తీవ్రంగా మనోవేదనకు గురయ్యారన్నారు. లడ్డూకే పరిమితం చేయకుండా మిగతా అన్ని పదార్థాలను తనిఖీ చేయాలన్నారు. 1857లో సిపాయిల తిరుగుబాటు ఎలా జరిగిందో చరిత్ర పుస్తకాల్లో చదివామని.. లడ్డూ కారణంగా హిందువుల మనోభావాలు ఎలా దెబ్బతిన్నాయో ఇప్పుడు చూస్తున్నామన్నారు. ఇందులో ప్రమేయం ఉన్నవారిని శిక్షించాలని, ఆస్తులను జప్తు చేసి.. వారందరినీ జైల్లో పెట్టాలన్నారు. మార్కెట్‌లో లభించే నెయ్యి సంగతేంటని ప్రశ్నించారు. ఆ నెయ్యిలో ఏం కలుస్తుందో ఎవరైనా తనిఖీ చేశారా? అన్నారు. ఆహార పదార్థాలను కల్తీ చేస్తూ శాకాహారం అని పిలిచే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆలయ నిర్వహణ సాధువులు, ఆధ్యాత్మికవేత్తల పర్యవేక్షణలో ఉందా? లేదా? అనేది చూడాలన్నారు. కమిటీలో ప్రభుత్వం నుంచి ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ప్రధాన నిర్ణయాలు, ప్రతిదీ ఎస్‌జీపీసీ వంటి మతపరమైన బోర్డులు తీసుకోవాలన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన ఎన్‌డీయే లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వినియోగించారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. నెయ్యిలో జంతువుల కొవ్వులు ఉన్నాయని.. ప్రస్తుతం టీడీపీ హయాంలో స్వచ్ఛమైన నెయ్యిని వాడుతున్నామన్నారు. ఆలయంలోని ప్రతి వస్తువును శానిటైజ్ చేసినట్లు వివరించారు.

బంగ్లాదేశ్‌లో 'హిల్సా' ఎగుమతులపై నిషేధం ఎత్తివేత..

భారత్‌కు 3 వేల టన్నుల హిల్సా చేపలు..!

న్యూఢిల్లీ–నవభూమి: బంగ్లాదేశ్ ప్రభుత్వం బెంగాలీ ప్రజలకు శుభవార్త చెప్పింది. బంగ్లాదేశ్ నుంచి హిల్సా చేపల ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసింది. త్వరలో 3 వేల టన్నుల పద్మాపులస చేపలను భారతదేశానికి ఎగుమతి చేసేందుకు అక్కడి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయి, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది భారతదేశానికి హిల్సా చేపల ఎగుమతిపై నిషేధం విధించింది. ఇప్పుడు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది.కాగా, పశ్చిమ బెంగాల్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలో హిల్సాను వండుకొని తింటారు. కొంతమంది బెంగాల్ ప్రజలు వీటిని పూజల్లో నైవేద్యంగా కూడా సమర్పిస్తారు. ప్రతి ఏడు దుర్గా పూజ సమయానికి భారత్‌కు బంగ్లాదేశ్ హిల్సా చేపలను ఎగుమతి చేస్తుంది. సాధారణంగా కోల్‌కతా మార్కెట్లలో కిలో హిల్సా ధర దాదాపు వెయ్యి రూపాయలు ఉంటుంది. బంగ్లాదేశ్‌లోని పద్మా నదిలో ఈ హిల్సా చేపలు పుడతాయి. అందుకే వీటికి పద్మా పులస అనే పేరొచ్చింది.ప్రపంచంలోని దాదాపు 70 శాతం హిల్సాలు బంగ్లాదేశ్‌లోనే ఉత్పత్తి అవుతాయి. 2012లో తీస్తా నది నీటి భాగస్వామ్య ఒప్పందంపై భారత్‌కు, బంగ్లాకు మధ్య విభేదాలు తలెత్తడంతో ఈ చేపల ఎగుమతిపై నిషేధం విధించింది. ఈ కారణంగా పశ్చిమబెంగాల్ మార్కెట్లలో వీటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భారతదేశం–బంగ్లాదేశ్ సరిహద్దులో హిల్సా చేపల స్మగ్లింగ్ మొదలయ్యింది. దీంతో 2022లో అప్పటి బంగ్లా ప్రధాని షేక్ హసీనా నిషేధాన్ని ఎత్తివేశారు.

నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్ర పన్నారు: అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ–నవభూమి: తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోదీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు.కాగా, తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు.మరోవైపు బీజేపీ తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు బస్సు చార్జీలు ఉచితంగా ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా? ' అని ప్రశ్నించారు. 22 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, వారు ఏ రాష్ట్రంలోనైనా ఉచిత విద్యుత్తు లేదా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? అని నిలదీశారు. 'నేను దొంగనా? లేదా కేజ్రీవాల్‌ను జైలుకు పంపిన వ్యక్తులు దొంగలా?' అని ప్రశ్నించారు.

రైలు పట్టాలపై మినీ గ్యాస్ సిలిండర్..

తృటిలో తప్పిన పెను ముప్పు

న్యూఢిల్లీ– నవభూమి: రైలు పట్టాలపై మినీ గ్యాస్ సిలిండర్ కలకలం రేపింది. రైలు పట్టాలు తప్పాలనే కుట్రతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడ్డారు. రైల్వే ట్రాక్‌పై సిలిండర్ అమర్చిన ఘటన ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకొంది. ప్రేమ్‌పుర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఢిల్లీ %–% హౌరా రైల్వే ట్రాక్‌పై దీన్ని గుర్తించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు. పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను గుర్తించే సమయానికి లూప్‌లైన్‌లో కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఒక గూడ్స్ రైలు వెళ్తోంది. ఒక ఎక్స్‌ప్రెస్ రైలుకు దారిచ్చే క్రమంలో దాన్ని ఆపారు. అదే సమయంలో లోకోపైలట్ ట్రాక్‌పై సిలిండర్‌ను గమనించి వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చాడు. దాంతో పెను ప్రమాదం తప్పింది. రైళ్లను పట్టాలు తప్పించి, ప్రమాదాలకు గురిచేసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఇటీవల కాలంలో పెరిగాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.గత ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని రైల్వేశాఖ తెలిపింది. కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి, రైళ్లకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ప్రకటించింది. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే నివేదిక వెల్లడించింది. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆ తర్వాత పంజాబ్, జార?ండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి.ఇలాంటి దుశ్చర్యలవల్లనే ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ప్రమాదం జరగిందని తేలింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం మరోసారి కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ ఘటనలు వెలుగుచూశాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీకి వెళ్తున్న కాళింది ఎక్స్‌ప్రెస్ కాన్పూర్ సమీపంలో పట్టాలపై ఉన్న గ్యాస్ సిలిండర్‌ను ఢీకొట్టింది.

మహిళను 32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచారు

బెంగళూరు:–నవభూమి: బెంగళూరులోని వయలికవల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను దారుణంగా హతమార్చారు. ఏసీపీ సతీశ్ కుమార్ కథనం ప్రకారం%ొ% మహాలక్ష్మీ(29) అనే మహిళను తన ఇంట్లోనే హతమార్చి, 32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచిపెట్టారు. దాదాపు 4–5 రోజుల క్రితం ఈ ఘటన జరిగింది. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తుండటం వల్ల ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది.ఈ దారుణ హత్యపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గత ఏడాది ఇలాంటి ఘటనే ఢిల్లీలో జరిగింది. శ్రద్ధా వాకర్ అనే యువతిని ఆమె ప్రియుడు దారుణంగా హతమార్చి ముక్కలు చేసిన ఘటన తెలిసిందే.

పరీక్షల్లో అక్రమాల భయం.. ఆ రాష్ట్రంలో మొబైల్ ఇంటర్నెట్ బంద్

రాంచి– నవభూమి: శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పుకార్లు వ్యాపించకుండా మొబైల్ ఇంటర్నెట్‌ను బంద్ చేయడం గురించి చాలాసార్లు విన్నాం. కానీ, జార?ండ్ ప్రభుత్వం మాత్రం పరీక్షల్లో అక్రమాల భయంతో మొబైల్ ఇంటర్నెట్‌ను ఆపేయాలని నిర్ణయించింది. పరీక్షల కోసం ఇలాంటి ముందు జాగ్రత్త చర్య తీసుకోవడం బహుశా దేశంలో ఇదే మొదటిసారి.జార?ండ్ జనరల్ గ్రాడ్యుయేట్ లెవెల్ కంబైన్డ్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్(జేజీజీఎల్‌సీసీఈ) పరీక్షలు శనివారం, ఆదివారాల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పరీక్ష జరిగే రెండు రోజులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, టెలిగ్రామ్, ట్విట్టర్ వంటి మొబైల్ యాప్‌లను ఉపయోగించి గతంలో కొందరు అక్రమాలకు పాల్పడ్డట్టు గుర్తించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కోర్ట్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తిరుమల లడ్డూ కల్తీని తీవ్రంగా పరిగణిస్తున్నాం

హుబ్బళి–నవభూమి: కల్తీ కారణంగా తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రం అయ్యిందని వస్తున్న ఆరోపణలపై కేంద్రం స్పందించింది. లడ్డూ కలీ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనికొక తార్కిక ముగింపును ఇస్తామని కేంద్ర ఆహార, వినియోగదారుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. హుబ్బళిలో శనివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని నెయ్యి వాడకాన్ని నిలిపివేసిన అనంతరం టీటీడీపై ఆరోపణలు వచ్చాయని తెలిపారు. నెయ్యి కల్తీపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు.

అయోధ్యలో తిరుపతి లడ్డూలే పంచాం

ఈ ఏడాది జనవరిలో అయోధ్య దేవాలయ ప్రతిష్ఠ ఉత్సవంలో భక్తులకు తిరుపతి లడ్డూలనే ప్రసాదంగా పంపిణీ చేసినట్టు ఆ ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మరోవైపు కల్తీ నెయ్యికి సంబంధించిన వివాదంలో తమ కంపెనీని లాగడం పట్ల గుజరాత్‌కు చెందిన అమూల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లడ్డూ తయారీలో తాము సరఫరా చేసిన నెయ్యిని వాడినట్టు ప్రచారం జరగడాన్ని ఖండిస్తూ దీనిపై చర్య తీసుకోవాలంటూ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆ ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల్లో నెల వేతనం జమ : కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ– నవభూమి:కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించినట్టుగానే కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఒక నెల వేతనాన్ని వారి ఈపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్టు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఆ ప్రకారం ఒక ఉద్యోగి ఖాతాలో గరిష్ఠంగా రూ.15 వేలు జమకానున్నాయి. ఇక తెలంగాణలో 36,018 సంస్థల కింద 47.96 లక్షల మంది చందాదారులు, 4.54 లక్షల మంది పెన్షన్ తీసుకునేవాళు ఉన్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు.కేంద్రమంత్రి మాండవీయ హైదరాబాద్ బర్కత్‌పురాలోని పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పై మన్‌సుఖ్ మాండవీయ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈపీఎఫ్ తెలంగాణ జోన్‌లో ఏటా రూ.7,797 కోట్ల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు.యువ ఉద్యోగుల కోసం కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ పథకం కింద మొదటిసారి ఉద్యోగంలో చేరే యువతీ యువకులకు ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించనుంది.

హెచ్ఐవీకి టీకా వచ్చేసింది.. వారం వ్యవధిలో రెండు డోసులు

హైదరాబాద్– నవభూమి:: ప్రపంచవ్యాప్తంగా ఏటా పది లక్షల మంది హెచ్ఐవీ మహమ్మారి బారినపడుతున్నారు. వేలాదిమంది మరణిస్తున్నారు. రోగ నిరోధక శక్తికి దొరకకుండా హెచ్ఐవీ వైరస్ తరచూ మ్యుటేషన్‌కు లోనవుతుండటంతో ఈ వ్యాధిని నయం చేయడం కుదరట్లేదు. శక్తిమంతమైన ఔషధాలు, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఏడు వ్యాక్సిన్ డోసులతో ప్రభావం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. దీంతో అమెరికాలోని ఎంఐటీ పరిశోధకులు హెచ్ఐవీ నియంత్రణకు ఓ టీకాను అభివృద్ధి చేశారు.

వారం వ్యవధిలో రెండు డోసులు

హెచ్ఐవీ నియంత్రణ కోసం ఈ టీకాను వారం వ్యవధిలో రెండు మోతాదులుగా ఇస్తారు. తొలి డోసులో 20 శాతం వ్యాక్సిన్‌ను, రెండో డోసులో 80 శాతం వ్యాక్సిన్‌ను రోగికి వేస్తారు. స్వల్ప వ్యవధిలో ఇచ్చే ఈ రెండు డోసులతో వైరస్ మ్యుటేషన్ జరిగేలోగా టీకా తన పనిని చేస్తుందని, రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజితం చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు వెల్లడించారు. 'ఇంట్రెస్టింగ్ ఇంజినీరింగ్' ఈ వివరాలను వెల్లడించింది.

మీ వాటర్ ప్యూరిఫైర్ మంచిదేనా?

హైదరాబాద్– నవభూమి: నల్లా నీటి కంటే ప్యూరిఫైర్ నీరు ఆరోగ్యానికి మంచిదని మనం తాగుతూ ఉంటాం. ఆర్వో, యూవీ, ఆల్కలైన్ తదితర వెరైటీల పేరిట మార్కెట్లో ఎన్నో ప్యూరిఫైర్లు లభిస్తున్నాయి. అయితే, ప్యూరిఫైర్లు నీటిని శుద్ధిచేసే క్రమంలో శరీరానికి అత్యవసరమైన మెగ్నీషియం వంటి ఖనిజాలను కూడా వడపోస్తున్నట్టు ఇజ్రాయెల్ పరిశోధకుల తాజా అధ్యయనంలో తేలింది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం.. ప్రతీ లీటర్ నీటిలో 40 నుంచి 81 మిల్లీగ్రాముల మెగ్నీషియం అనేది కచ్చితంగా ఉండాలి.అయితే, మార్కెట్లో లభిస్తున్న చాలా ప్యూరిఫైర్ల నీటిలో అసలు మెగ్నీషియం కనిపించట్లేదని పరిశోధకులు పేర్కొన్నారు.

ఈ వివరాలు 'నేచర్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. శరీరానికి తగినంత మెగ్నీషియం అందకుంటే నాడీ సంబంధిత వ్యాధులతో పాటు మెదడుకు రక్త ప్రవాహంలో సమస్యలు, టైప్–2 డయాబెటిస్, డిమెన్షియా వచ్చే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు. మెగ్నీషియం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడంతో పాటు మెగ్నీషియం ఖనిజాన్ని వడబోయని ప్యూరిఫైర్‌ను చూసి కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచించారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి.. తృటిలో తప్పిన భారీ ప్రమాదం

హైదరాబాద్- నవభూమి: గణేష్ నిమజ్జనంలో భారీ విషాదం తృటిలో తప్పింది. ముంబైలోని అంధేరి ఛా రాజా విగ్రహాన్ని వెర్సోవా బీచ్‌లో నిమజ్జనం చేసేందుకు భక్తులతో వెళ్తున్న పడవ ఊహించని విధంగా నీటమునిగిన సంఘటన ఆదివారంనాడు మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో జరిగింది. రెండు డజన్ల మందికి పైగా భక్తులు నీటిలో పడటంతో ఒక్కసారిగా అందరూ అందోళనకు గురయ్యరు. ఈత తెలిసిన కొందరు ఒడ్డుకు చేరుకోగా, తక్కిన వారిని సమీపంలోని పడవల్లో ఉన్న వారు సురక్షితంగా బయటకు తెచ్చారు.

దీంతో పెను విషాదం తప్పింది. ఒక భక్తుడు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

థానేలో రాళ్లు రువ్వుడు ఘటన

కాగా, థానేలో గణేష్ నిమజ్జనం ఉరేగింపుపై రాళ్లు రువ్విన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వంజరి పట్టి నాక ప్రాంతంలో ఈనెల 18న ఈ ఘటన జరిగింది. అగతంకులు విసిరిన రాళ్లకు గణేష్ విగ్రహం దెబ్బతినడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. మాంసం దుకాణం మీదుగా ఊరేగింపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని విశ్వహిందూ పరిషత్ కార్యాలయం ఫిర్యాదు చేయడంతో ఐపీసీలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

జనభాషలో తీర్పులే న్యాయం!

న్యాయం చెయ్యడమే కాదు, చేస్తున్నట్లూ కనిపించాలన్నది సమున్నత న్యాయసూత్రం. కాలానుగుణ సంస్కరణలకు నోచక, కొందరు న్యాయమూర్తులే లోగడ చెప్పినట్లు ఇంకా ఎడ్లబండి కాలంలోనే ఉన్న న్యాయపాలికలో- కక్షిదారులకు అర్థంకాని భాషలో సాగే వాదోపవాద విన్యాసాలు న్యాయార్థుల్ని ఏ దరికి చేరుస్తున్నాయన్నది అగమ్యగోచరం! సర్వోన్నత, ఉన్నత న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల కొండలు కొద్దిగా కరుగుతుంటే, దిగువకోర్టుల్లో వాటి తాకిడి పెరుగుతోందని సర్కారీ లెక్కలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, 'సుప్రీం' ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాలు వెలువరించిన సూచనలు, హితోక్తులు ఎంతో విలువైనవి. ప్రజలకోసం న్యాయస్థానాలున్నాయిగాని, కోర్టులకోసం ప్రజలు కాదన్నదే న్యాయపాలిక సేవాగుణ మౌలిక లక్షణం కావాలని భారత ప్రధాన న్యాయమూర్తి ఉద్బోధించారు. అందుకు అనుగుణంగా- కక్షిదారులకు తెలిసిన, అర్థమయ్యే భాషలోనే హైకోర్టుల తీర్పులు ఉండాల్సిన అవసరాన్ని ప్రథమ పౌరుడు రామ్‌నాథ్ కోవింద్ నొక్కి చెప్పారు! దేశవ్యాప్తంగా 24 ఉన్నత న్యాయస్థానాలున్నాయి. వాటిలో న్యాయ విచారణ ప్రక్రియ కక్షిదారులకు అవగతం కాని ఆంగ్లభాషలోనే సాగుతుండటంపట్ల దశాబ్దాలుగా వాద వివాదాలు రేగుతున్నాయి. పూర్వాశ్రమంలో న్యాయవాదిగా ఆ సమస్య లోతుపాతులు తెలిసిన కోవింద్- కనీసం తీర్పుల సారం కక్షిదారులకు అవగాహనకు వచ్చేలా వారి వారి భాషల్లో ఆయా న్యాయ నిర్ణయాల అనువాద ధ్రువీకృత ప్రతుల్ని అందించే యంత్రాంగం ఏర్పాటు కావాలని సూచిస్తున్నారు! అంతవరకు అది బాగానే ఉన్నా- ఆయా రాష్ట్రాల పరిధిలోని దిగువ కోర్టుల్లో స్థానిక భాషల్లో న్యాయ విచారణ ప్రక్రియ ఇంకా అమలుకాకపోవడం ఏమిటి? తాము వెళ్లబోసుకొనే గోడు ధర్మపీఠాల దృష్టికి సజావుగా చేరుతోందో లేదో తెలియక, విచారణ ప్రక్రియలో, తీర్పుల్లో ఆంగ్ల భాష అర్థంకాక కక్షిదారులు పడే వేదనకు దశాబ్దాలుగా పరిష్కారం ఏదీ?

సామాన్యుడు సైతం తన కేసును తానే వాదించుకొని సరైన పరిష్కారం పొందగల న్యాయవ్యవస్థ ఉండాలని పూజ్య బాపూజీ ఆకాంక్షించారు. వివాద పరిష్కారంకోసం బక్క రైతు బస్తీకి వెళ్ళి కొన్ని వారాల పాటు బస చేయాల్సిన పరిస్థితి రాకూడదని గాంధీజీ అభిలషించినా- పలుపు కోసం కోర్టుకెక్కి బర్రెను అమ్ముకొనే దుస్థితి దాపురించిందిప్పుడు! తమ తరఫున నల్లకోటు వకీళ్లు తమకే మాత్రం తెలియని భాషలో ఏం వాదిస్తున్నారో గుడ్లప్పగించి చూడటమేగాని, తమ గుండె ఘోష వాళ్ల గళాల్లో పలుకుతున్నదీ లేనిదీ తెలుసుకోగల అవకాశం కోట్లాది కక్షిదారులకు లేదు. రాజ్యాంగంలోని 348 అధికరణ సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఆంగ్ల భాషే చెల్లుబాటు కావాలని తీర్మానించింది. ఆయా హైకోర్టుల్లో ప్రాంతీయ భాషల వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వచ్చే వినతుల్ని ఆమోదించరాదని సర్వోన్నత న్యాయపాలిక 1997, 1999, 2012లో గట్టిగా నిర్ణయించింది. కోర్టుల తీర్పుల్ని హిందీతోపాటు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యులులో పొందుపరచిన భాషల్లో తర్జుమా చేసి అందుబాటులో ఉంచాలన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2015 డిసెంబరులో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కోర్టుల భాష ఆంగ్లమేనంటూ 'సుప్రీం' గట్టిగా స్పష్టీకరించిన నేపథ్యంలో- రాష్ట్రపతి తాజా సూచనకు ఏ పాటి మన్నన దక్కుతుందో చూడాలి. అంతకు మించి, దిగువ కోర్టుల్లో ఆంగ్లభాష వినియోగాన్ని కక్షిదారులపట్ల క్రూర పరిహాసంగానే సంభావించాలి! సూటిగా సరళంగా స్పష్టంగా ఉండాల్సిన తీర్పులు ఆంగ్ల భాషా పటాటోప ప్రదర్శనగా నివ్వెరపరుస్తున్నాయంటూ మొన్న మే నెలలో వెలుగు చూసిన వార్తాకథనాలు- నాణేనికి ఒక పార్శ్వం. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో పోగుపడిన రెండుకోట్ల 68 లక్షల కేసుల్లో స్థానిక భాషల్లో విచారణ జరిగినప్పుడే కక్షిదారులకు దక్కుతుంది- పారదర్శక న్యాయం!

'అసలు న్యాయస్థానాల్లో వాదనలు, ఇతర కార్యకలాపాలు ఆంగ్లంలో కొనసాగడం ఏమిటి? ఇంకా ఎంతకాలం ఈ దారుణం?'- రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జీఎస్ సింఘ్వి 2006లో వ్యక్తీకరించిన ధర్మాగ్రహమది! జిల్లా సెషన్స్ కోర్టు, అంతకు దిగువనున్న న్యాయాలయాల్లో స్థానిక భాషలోనే తీర్పులు వెలువడాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 1974లోనే ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాల జారీతోనే తన బాధ్యత తీరిపోయిందని భావించిన ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి నిదర్శనగా, న్యాయాలయాల్లో ఆశ్రితులకు అర్థంకాని ఆంగ్లమే నేటికీ రాజ్యమేలుతోంది. తెలుగు గడ్డపై తెలుగులో న్యాయపాలనకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని, న్యాయ పదకోశాలు, న్యాయ శాస్త్ర గ్రంథాలు, చట్టాలను అనువదించడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉందని 2013 ఫిబ్రవరిలో ప్రధాన న్యాయమూర్తిగా పినాక చంద్రఘోష్ ప్రకటించారు. దాదాపు అదే సమయంలో- స్థానిక న్యాయస్థానాల్లో తెలుగు వెలుగులీనేలా చేయడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులున్నాయన్న జస్టిస్ ఎన్.వి.రమణ- తెలుగులో న్యాయ పదకోశం సరిగా అందుబాటులో లేకపోవడం వాటిలో ఒకటంటూ రాష్ట్ర న్యాయ అకాడమీ అధ్యక్షులుగా తనవంతు ప్రయత్నం చేశారు. రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణాల్లో సామాన్య జన భాషలోనే తీర్పులుంటాయంటున్నప్పుడు ఆ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలూ వెనుకబడటం ఏమిటి? న్యాయపాలన క్రతువు తేట తెనుగులో సాగితే పారదర్శకత ఇనుమడించి కేసుల సత్వర పరిష్కారమూ సాధ్యపడుతుంది. మాతృభాషకు మంగళారతులు పడతామంటున్న ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలూ దిగువ కోర్టుల్లో తెలుగు వెలుగుకు దివిటీలు పట్టే కార్యాచరణను సత్వరం పట్టాలకెక్కించాలి!

'జమిలి' దిశగా...

జమిలి ఎన్నికల విషయంలో మరో అడుగుపడింది. ఈ మధ్యనే, సార్వత్రిక ఎన్నికలకు కాస్తంత ముందు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన నివేదికను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. లోక్‌సభలో సొంతబలం గట్టిగా ఉన్న తొలి రెండు పర్యాయాల్లో ఈ దిశగా సాగించిన ప్రయత్నాలను, ఇప్పుడు సరిపడా స్వశక్తి లేని దశలోకూడా ముందుకు తీసుకుపోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. జమిలితో దేశానికి ఎంతో మంచిది అంటూ బీజేపీ పెద్దలు పట్టువీడకుండా పోరాడుతున్న తీరు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

విపక్షాలు ఆదినుంచీ జమిలిని వ్యతిరేకిస్తున్నాయి కనుక, ఇప్పుడు మరింత గట్టిగా విరుచుకుపడటం సహజం. దేశానికి మంచిదన్న పేరిట బీజేపీ తన స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం, ఉజ్వల భవిష్యత్తుకోసం, మిగతాపార్టీల పతనం కోసం ఈ జమిలిని దేశంమీదకు రుద్దుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. చీటికీమాటికీ ఎక్కడోక్కడ ఎన్నికలు వచ్చిపడుతూ, అవి ఎక్కడ జరిగినా విధాన నిర్ణయాలకు, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్న స్థితిలో జమిలి వల్ల మాత్రమే ప్రజాధనం ఆదాకావడంతో పాటు, అభివృద్ధి కూడా పరుగులుపెడుతుందని అధికారపక్షం చెబుతూవస్తోంది. మోదీ మొదటివిడత ఎన్నికల మానిఫెస్టోలోనే జమిలి ప్రతిపాదన ఉంది. మరో రెండేళ్ళకు నీతిఆయోగ్ బరిలోకి దిగింది. మరో రెండేళ్ళకు లా కమిషన్ తన లోతైన అధ్యయనంతో ఏకకాల ఎన్నికలకు ఏయే రాజ్యాంగసవరణలు అవసరమో చెప్పింది. ఒకప్పుడు ససేమిరా కూడదన్న కమిషనే మోదీ ఏలుబడిలో అందుకు సరేనన్నది.

%ప్రధాని మోదీ ఓ అఖిలపక్షాన్ని ఏర్పాటుచేయడం, కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు వెళ్ళకపోవడం తెలిసిందే. జమిలిమీద ఎందుకంత ప్రేమ కలిగిందో తెలియదు కానీ, రెండేళ్ళక్రితం అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ తాము సిద్ధం అన్నరీతిలో ఓ ప్రకటన చేసేశారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్నప్పుడు, ఫలానా రాష్ట్రాన్ని జాబితాలో చేర్చకపోవడానికి ఈవీఎంల లభ్యత, సైనికబలగాల తరలింపుల వంటి సమస్యలు కారణమని ఎన్నికల అధికారులు చెబుతూంటారు. దేశవ్యాప్తంగా ఒకేమారు ఎన్నికలు జరపాలనుకుంటే ఈ తరహా చాలా రకాల కొరతలున్నాయని నిపుణులు చేస్తున్న విశ్లేషణలు కూడా కొందరికి నచ్చడం లేదు. బందోబస్తు సంగతి అటుంచితే, లక్షలాది ఈవీఎంలను వేలకోట్ల ఖర్చుతో కొనాల్సి ఉంటుందన్నది వాస్తవం. ఏకకాలంలో ఎన్నికల మంచిచెడులమీద ఇప్పటికే మాధ్యమాల్లో కొంత చర్చ జరిగింది. ప్రజాధనం వృధాకావడం నుంచి అభివృద్ధి సంక్షేమపథకాల నిరవధిక అమలు వరకూ ప్రతీ వాదనమీదా భిన్నాభిప్రాయాలున్నాయి.

జమిలి విషయంలో బీజేపీ పట్టుదల వెనుక తమ ఉనికిని దెబ్బతీసే రాజకీయ లక్ష్యం ఉన్నదని ప్రాంతీయపార్టీల వాదన. ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు కేంద్రంలో ఎవరుండాలన్న అంశమే రాష్ట్రస్థాయి ఎంపికనూ ప్రభావితం చేస్తుందని, ఓటర్లు అక్కడా ఇక్కడా ఒకేపార్టీ అన్నధోరణిలో పోతారని వాటి భయం. జాతీయాంశాలు ముందుకు వచ్చి తమను దెబ్బకొడతాయని వాటి వాదన. దేశభక్తి, సరిహద్దు సమస్యలు, యుద్ధాలు, కులమతాలు ఇత్యాదివి ప్రభావితం చేసినప్పుడు స్థానికాంశాలు వెనక్కుపోవచ్చు. జమిలివస్తే ఒకేపార్టీకి ఓటుచేస్తామని డెబ్బయ్‌శాతం మంది ఓ సర్వేలో చెప్పారట.

'ఒకేదేశం%-%ఒకే ఎన్నిక' విధానం ప్రజాస్వామ్యానికి మంచిదా కాదా అన్నది అటుంచితే, బీజేపీ గతంలో కంటే దిగజారిన తన సంఖ్యాబలంతో దానిని గట్టెక్కించగలదా అన్నది ప్రశ్న. బీజేపీ ఆశిస్తున్నది జరగాలంటే, రాజ్యాంగానికి అరడజను సవరణలు చేయాలి, అందుకు మూడింట రెండువంతులమంది సభ్యులు దానిపక్షాన ఉండాలి, ఆ తరువాత రాష్ట్రాలు దానిని ఆమోదించాలి. ఈ దేశంలో ప్రజలూ ఇతర పార్టీలూ జమిలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున ఇదంతా జరిగేది కాదని, ప్రజల దృష్టిమరల్చే ప్రయత్నమని కాంగ్రెస్ అంటున్నప్పటికీ, తిమ్మినిబమ్మిని చేసి అయినా సరే, బీజేపీ కచ్చితంగా తాను అనుకున్నది సాధిస్తుందని అత్యధికుల విశ్వాసం. కోవింద్ కమిటీముందు తలూపిన పార్టీల్లో కొన్ని భవిష్యత్తులో కాదుపొమ్మన్నా, కొత్త చేయూతలతో గట్టెక్కవచ్చునని బీజేపీ పెద్దలు నమ్మకంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

అక్కడ సమయానికి వడ్డీ కూడా ఇస్తారు.. ఎలాగంటే!

స్విట్జర్లాండ్‌కి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకత ఉంది. ఇటీవలి కరోనా కాలంలో కూడా ఆ దేశంలో ఒక్క కేసు కూడా రాకుండా జాగ్రత్తపడ్డారు. అన్ని విషయాలలోనూ కొత్తగా ఆలోచిస్తారు ఆ దేశీయులు. ఏ ఆసరా లేని వృద్ధుల గురించి ఒక కొత్త పథకం ప్రవేశపెట్టారు. అదే 'టైమ్ బ్యాంక్ ' స్కీమ్. ఒంటరిగా, కుటుంబ సభ్యుల సహకారం లేకుండా నివసిస్తున్న సీనియర్ సిటిజెన్లకు అండగా నిలబడటానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. స్విట్జర్లాండ్‌లో ఒక పాఠశాల దగ్గర 67 సంవత్సరాల ఒంటరి మహిళ ఉండేవారు. ఆవిడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి రిటైరయ్యారు. తనకొచ్చే పెన్షన్‌తో ఆవిడ హాయిగా కాలం గడపవచ్చు. కాని ఆమె ఖాళీగా కూర్చోవటానికి ఇష్టపడలేదు. తనకంటె 20 సంవత్సరాలు ఎక్కువ వయసున్న ఒక వృద్ధురాలికి సేవ చేసే పనిలో కుదిరారు. డబ్బు కోసం పనిచేయవలసిన అవసరం లేదు ఆమెకకు. తన సమయాన్ని టైమ్ బ్యాంకులో దాచుకోవటానికి పనిచేశారు. అక్కడే మొదలు..టైమ్ బ్యాంక్‌ను స్విట్జర్లాండ్‌లోని ప్రభుత్వ సామాజిక భద్రతా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసింది. అక్కడి ప్రజలు యవ్వనంలో, ఆరోగ్యంగా ఉన్నప్పుడు... నిస్సహాయులైన వృద్ధులకు సేవలందిస్తూ, సమయాన్ని దాచుకొని, తిరిగి వారికి అవసరంలో ఉన్నప్పుడు ఉపయోగించుకోవచ్చు, ఇందుకోసం వారు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. చక్కగా మాట్లాడే సంభాషణ నైపుణ్యం ఉండాలి. ప్రతిరోజు వారి సేవలను కోరుకునే వారికి కావలసిన సేవలు అందించగలిగే స్థితిలో ఉండాలి. వారి సేవాకాలాన్ని వారి వ్యక్తిగత ఖాతాలో 'సామాజిక భద్రత మంత్రిత్వశాఖ' జమ చేస్తుంది. అలా ఆ 67 సంవత్సరాల మహిళ వారానికి రెండు రోజులు రెండు గంటల చొప్పున వృద్ధులకు సేవలు అందించటానికి వెళ్లేవారు.

వారి గదుల్ని శుభ్రం చేయటం, వారికి కావలసిన సరుకులు తేవటం, వారికి ఎండలో స్నానం చేయటానికి సహకరించటం వంటి పనులకు సహాయపడేవారు.. కొద్దిసేపు వారితో సరదాగా ముచ్చటించటానికి సమయం కేటాయించేవారు. వారు దరఖాస్తులో చేసుకున్న ఒప్పందం ప్రకారం. సంవత్సరం తర్వాత 'టైమ్ బ్యాంక్' వారు ఆమె సేవాకాలాన్ని లెక్కించి, 'టైమ్ బ్యాంక్ కార్డు' జారీ చేసింది. ఆమెకు ఇతరుల సహాయం అవసరం ఉన్నపుడు తన కార్డును ఉపయోగించుకోవచ్చు. ఇక్కడ మరో ఆసక్తికర అంశం ఉంది. బ్యాంకులో డబ్బులు దాచుకుంటే వడ్డీ వచ్చినట్లుగానే, ఖాతాలో ఉన్న సమయాన్ని వడ్డీతో సహా తిరిగి వాడుకోవచ్చు. దరఖాస్తును పరిశీలించి, టైమ్ బ్యాంక్ ఒక వాలంటీర్‌ను ఆమె ఇంటికి గానీ, ఆస్పత్రికి గానీ పంపుతారు.ఒక టీచర్ తన అనుభవాన్ని, "ఒకరోజు నేను స్కూల్లో ఉన్నపుడు నాకు పిలుపు వచ్చింది. నేను అక్కడకు వెళ్లాను. ఆవిడ... తాను కిటికీ శుభ్రం చేస్తుంటే స్టూల్ మీద నుంచి జారిపడ్డానని చెప్పింది. నేను వెంటనే స్కూల్‌కి సెలవు పెట్టి, ఆవిడను ఆసుపత్రికి తీసుకువెళ్లాను. ఆవిడకు మడమ దగ్గర ఫ్రాక్చర్ అయ్యిందనీ, కొంతకాలం పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలనీ చెప్పారు డాక్టర్. నేను కొన్ని రోజుల పాటు ఆవిడ ఇంటి దగ్గర ఉండటానికి సిద్ధపడ్డాను. అయితే ఆవిడ నన్ను దిగులుపడద్దని, అప్పటికే తాను టైమ్ బ్యాంక్‌కి దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు. ఆసుపత్రిలో చేరిన రెండు గంటలకే, ఆవిడకు సేవలందించడానికి టైమ్ బ్యాంక్ వారు వాలంటీర్లను పంపారు. నెల రోజుల పాటు ఆ వాలంటీర్ ఆమె యోగక్షేమాలు చూసుకున్నారు. ఆమెకు ఇష్టమైన వంటకాలు తయారు చేసి పెట్టారు. మనసుకు ఉల్లాసం కలిగించేలా కబుర్లు చెప్పారు. సకాలంలో మంచి సేవలు అందటం వల్ల, త్వరగా కోలుకుని, తిరిగి తన పనులు తాను చేసుకోవటం మొదలుపెట్టారామె. తాను ఇంత ఆరోగ్యంగా ఉండటానికి టైమ్ బ్యాంక్‌లో మరింత కాలాన్ని నమోదు చేసుకుంటానంది ఆవిడ" అని చెప్పారు.రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన టైమ్ బ్యాంకు సేవలను ఇప్పుడు స్విట్జర్లాండ్‌లో అందరూ ఆనందంగా వినియోగించుకోవటం సర్వసాధారణమైపోయింది. ఈ పద్ధతి వల్ల ఆ దేశంలో బీమా ఖర్చులు బాగా తగ్గాయి. అనేక సామాజిక సమస్యలు కూడా పరిష్కారమవుతున్నాయి. ఆ దేశప్రజలు ఈ విధానాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారు. అక్కడ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ఆ దేశ పౌరులలో సగం మంది పౌరులు టైమ్ బ్యాంకు విధులలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రభుత్వం ఈ విధానాన్ని చట్టబద్ధం చేసింది. ప్రస్తుతం ఆసియా దేశాల్లో ఒంటరి గూటి వృద్ధ పక్షుల సంఖ్య బాగా పెరిగిపోతుండటం వల్ల వారి సంక్షేమం ఒక సామాజిక సమస్యగా మారుతోంది. అన్ని దేశాల వారు స్విట్జర్లాండ్ 'టైమ్ బ్యాంక్ ' విధానం గురించి ఆలోచన చేసి, టైమ్ బ్యాంకు విధానాన్ని ప్రవేశపెట్టి, చట్టబద్ధం చేస్తే మంచిదేమో. ఆలోచించాల్సిన విషయమే.టైమ్ బ్యాంకు... ఈ పేరు వినగానే ఇది ఏమిటి అనిపిస్తుంది. మన దగ్గరున్న డబ్బులు మనీ బ్యాంకులో వేస్తాం. ఆ బ్యాంకుల గురించి అందరికీ తెలుసు. అలాగే మనం చేసిన పని సమయాన్ని టైమ్ బ్యాంకులో వేస్తాం.

అదే టైమ్‌బ్యాంక్. ఆ టైమ్‌ను, తను కదలలేని పరిస్థితుల్లో వినియోగించుకోవచ్చు. వినటానికి ఈ మాట కొత్తగా అనిపిస్తోందా. ఇది నిజం. స్విట్జర్లాండ్‌లో ఇప్పుడు అందరూ బాగా వినియోగించుకుంటున్న ఏకైక బ్యాంకు టైమ్ బ్యాంక్.

తారకనామం

భక్తుల్ని తరింపజేసేది- తారకనామం. సంసార సాగరాన్ని దాటించేది, మోక్షమిచ్చేది అని దానికి అర్థాలున్నాయి. సామాన్య మానవుడు ఎప్పుడూ పలు సమస్యల్లో తలమునకలవుతుంటాడు. అటువంటి పరిస్థితిలోనూ దైవధ్యానం వల్ల, అతడి హృదయంలో భక్తిభావన వెల్లివిరుస్తుంది. అలా భగవంతుణ్ని స్మరిస్తూనే భక్తుడు జీవనయానం సాగించాలని భగవద్గీత ఉద్బోధించింది.అనారోగ్యంతో బాధపడే మానవుడు వెంటనే వైద్యుణ్ని సంప్రతిస్తాడు. ఔషధ సేవనం వల్ల స్వస్థత పొందుతాడు. అతడి మనసు ప్రశాంతంగా ఉండాలన్నా, నిర్మలత్వం సంతరించుకోవాలన్నా దైవనామ స్మరణ సాగించాలంటాయి పురాణాలు. ఆ స్మరణే భక్తుడి పాలిట తారకమంత్రం. అన్నమయ్య, త్యాగయ్య, తుకారాం వంటి భక్తులు అదే తెలియజెప్పారు. 'శ్రీరామ రామ రామేతి' అంటూ చేసే నామజపం ఆధ్యాత్మిక శక్తినిస్తుందని శివదేవుడి ఉవాచ.

నగలు అనేక రూపాల్లో ఉంటాయి. వాటిని పలు పేర్లతో పిలుస్తుంటారు. బంగారం మాత్రం ఒక్కటే. అలాగే, నామాలు వేరైనా దేవుడు ఒక్కడే. రాముడు, కృష్ణుడు, శివుడు, కేశవుడు- ఏ దైవనామాన్ని జపించినా భక్తహృదయం తరిస్తుందంటారు పెద్దలు.

'ఓం నమో నారాయణాయ' అంటారు. అందులోని 'రా' అనే అక్షరంతో 'ఓం నమశ్శివాయ'లోని 'మ' అక్షరాన్ని జోడిస్తే, అదే 'రామ'నామం అవుతుంది. శివకేశవులు వేరు కాదు, ఒక్కరే- అనే సత్యాన్ని ఆ నామం ఆవిష్కరిస్తుంది. శివకేశవ సమన్వితమే రామశబ్దం. అది దివ్యమంత్రం. భక్తుల్ని తరింపజేయడమే దాని లక్ష్యం. రామ మంత్రాన్ని మహిమాన్వితంగా భావిస్తారు. అతి పవిత్రం, అత్యంత మధురమైన తారకనామం అది. తిక్కన, పోతన కావ్యాలు శివకేశవులు ఒక్కరేనని స్పష్టీకరించాయి.

దైవనామ స్మరణ మనిషికి శాంతి కలిగిస్తుంది. ఆనందం చేకూరుస్తుంది. ఆ స్వామి నామవైభవాన్ని వివరించే అంశాలెన్నో పురాణగాథల్లో కనిపిస్తాయి. శ్రీహరిని సదా ధ్యానించే భక్తజనుల పాదధూళి తనకు శిరోధార్యమని ఒక సందర్భంలో యమధర్మరాజు అంటాడు. నిరంతరం తన చింతనలోనే ఉండేవారికి అన్నీ తానే అవుతానన్నది భక్తులకు కృష్ణపరమాత్మ ఇచ్చిన అభయం.ప్రాణావసాన సమయంలో అజామీళుడు తన కుమారుడైన నారాయణ పేరును స్మరించినంతనే మోక్షప్రాప్తి కలిగిందంటుంది భాగవతం. ఓ చిలుక 'హరి' అనే రెండక్షరాల్ని పలికినంతనే చరితార్థత లభించిందని 'శ్రీకృష్ణ శతకం' చెబుతుంది. దివ్యమైన నరసింహ నామాన్ని జపించడంతోనే కైవల్యం సిద్ధిస్తుందంటుంది 'నరసింహ శతకం'. దాశరథీ శతక కర్త భక్తరామదాసు- రామనామాన్ని 'కష్టాల అగ్నిని చల్లార్చే అమృత వర్షం'గా వర్ణించాడు. రామశబ్దంలోని 'రా' అనే మొదటి అక్షరాన్ని పలకగానే మానవుడి లోపల దాగిన పాపచింతన వెలికివస్తుంది; అది తిరిగి అతడిలో ప్రవేశించకుండా 'మ' అనే అక్షరం కవాటంలా పనిచేస్తుందన్నది రామదాసు మాట.

రామనామాన్ని తులసీదాసు రత్నదీపంతో పోల్చాడు. ఆ నామం నాలుకపై ఆడుతున్నంతసేపూ మానవుడి మనసు, శరీరం నిర్మలమవుతాయని విశదీకరించాడాయన.

నవతార

స్మార్ట్ కిచెన్...

మహిళలకు వంటింటి పనుల్లో చేదోడుగా నిలించేందుకు కొన్ని స్మార్ట్ గ్యాడ్జెట్స్ మార్కెట్లోకొచ్చేశాయి. వేడి పాత్రలను సింపుల్‌గా స్టౌ మీద నుంచి దించాలన్నా, వెల్లుల్లి చకచకా రోస్ట్ చేయాలన్నా, టమాటో ముక్కలు సరిగ్గా కట్ చేయాలన్నా ఇకపై చిటికెలో పని. మరి ఇంతకీ ఆ స్మార్ట్ గ్యాడ్జెట్స్ ఏంటో చూద్దామా..

గరిటకు రెస్ట్..రోజూ వంట చేసే క్రమంలో ఆయా పదార్థాల్ని కలపడానికి వేర్వేరు గరిటలు వాడుతుంటాం. పనైపోయాక వాటిని స్టౌ మీదనో లేదో ప్లాట్‌ఫామ్ మీదో గబగబా పెట్టస్తుంటాం. దీనివల్ల ఆ ప్రదేశమంతా నూనె మరకలు పడి అపరిశుభ్రంగా తయారవుతుంది. అందుకే ఈ సమస్యకు చెక్ పెట్టడానికి 'స్పూన్ రెస్ట్ హెూల్డర్' మార్కెట్లోకొచ్చేశాయి. వీటిలో గరిట మాత్రమే కాదు పాత్రలపై పెట్టే మూతల్ని అమర్చుకునే సౌకర్యం కూడా ఉంది.

వెల్లుల్లి రోస్ట్ చేయడం కాస్త కష్టంతో కూడుకున్నదే. వాటిని పొయ్యి మీద లేదా ఓవెన్‌లో కాల్చాలన్నా ఆరంతం వెల్లుల్లి వాసనే వస్తుంది. అందుకోసమే ప్రత్యేకించి ఈ 'గార్లిక్ రోస్టర్' అందుబాటులోకి వచ్చింది. ఈ ఎలక్ట్రానిక్ పరికరంలో వెల్లుల్లి చివరలు కత్తిరించి కాస్త వంటనూనె లేదా ఆవనూనె గానీ వెయ్యాలి. అవసరమైతే పెప్పర్, సాల్ట్ చల్లి మూత పెట్టేకొని, ముందరున్న బటన్‌ని ఆన్ చేస్తే చాలు. అదే చక్కగా కాలతాయి. 30 నిమిషాల్లోనే గ్లారిక్ రోస్ట్ రెడీ అవుతుంది.

పిల్లలు గొడవపడుతుంటే..

ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే ఫైటింగ్స్‌కి కొదువుండదు. వాళ్లను సముదాయించడం తల్లిదండ్రులకు రోజూ సవాలుగానే ఉంటుంది. ఈ విషయంలో పేరెంటింగ్ ఎక్స్‌పర్ట్స్ చేస్తున్న సూచనలు ఇవి...

పిల్లలు గొడవపడినప్పుడు "వాళ్లు చూడు ఎంత బాగా కలిసుంటారో, ఎంత బాగా చదువుకుంటారో" అంటూ ఇతర పిల్లలతో ఎప్పుడూ పోల్చవద్దు. ఇంట్లో పిల్లలతో కూడా పోల్చకూడదు.

పిల్లలు ఏ విషయంలో దెబ్బలాడుకుంటున్నారో గమనించాలి. గొడవకు కారణం ఎవరో తెలుసుకోవాలి. ఒక సందర్భంలోనే కాకుండా ఇండివిడ్యువల్ అటెన్షన్ పెట్టి పరిశీలించాలి.

ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే వాళ్లను వేర్వేరుగా కూర్చోబెట్టాలి. ఒకేరూమ్‌లో కూర్చోబెట్టినప్పుడు గొడవ పడటానికి అవకాశం ఉంటుంది.

పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల విషయంలో తరచుగా గొడవపడుతుంటారు. ఒకరివి మరొకరు తీసుకోకుండా పేరెంట్స్ గమనించాలి.

పిల్లలకు ఒకరినొకరు గౌరవించడం నేర్పించాలి. కోపంలో కూడా అగౌరవపరిచేలా తిట్టుకోకూడదని గట్టిగా చెప్పాలి. పిల్లలు కొట్లాడుకునే సమయంలో ఒకరినొకరు తిట్టుకోవడం చూస్తూనే ఉంటాం. అలాంటి మాటలకు ఈ ఇంట్లో చోటు ఉండదు అని చెప్పాలి.

పిల్లలు కలిసి ఆడుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఆడేటప్పుడు వాళ్లను గమనిస్తుండాలి.

కొడితే పిల్లలు మారతారనుకోవడం సరైనది కాదు. కొడితే మరింత కోపానికి గురవుతారు. వారి మధ్య గొడవ పెరగడానికి దారి తీస్తుంది.

పిల్లలకు సెల్ఫ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ గురించి నేర్పించాలి. కోపాన్ని ఎలా హ్యాండిల్ చేయాలో చెప్పాలి. డ్రమ్స్ వాయించడం, పది నుంచి ఒకటి వరకు అంకెలు వెనక్కి కౌంట్ చేయమనడం, సౌండ్ ఎక్కువగా పెట్టి డ్యాన్స్ చేయడం... ఇలాంటి పనుల ద్వారా కోపాన్ని డైవర్ట్ చేసుకొమ్మని చెప్పాలి. ఎంత కోపంగా ఉన్నారో ఒక పేపర్ తీసుకుని షార్ట్ స్టోరీ రాయమనాలి. అంతేకానీ కొట్టడం, గిల్లడం, కొరకడం చేయకూడదని వివరించాలి.

ఇతర పిల్లల ఫీలింగ్స్‌పై కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానభూతి పెంపొందేలా చేయాలి. "బన్నీని చూడు. ఎలా ఏడుస్తున్నాడో... పాపం కదా!" అని కామెంట్స్ చేయడం ద్వారా పిల్లల్లో సానుభూతి పెరిగేలా చేయాలి.

రాత్రి డిన్నర్‌ను కుటుంబసభ్యులందరూ కలిసి చేయాలి. ఆ సమయంలో ఆ రోజు ఎవరు ఏం చేశారో తెలుసుకుని అభినందించుకునేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పును తీసుకురావచ్చు.

పిల్లలిద్దరూ గొడవ పడుతున్నా వాళ్లు కిడ్స్ అని తల్లిదండ్రులు గుర్తుపెట్టుకోవాలి. ఏదో ఒక టైంలో ఏ పిల్లవాడైనా తమ సిబ్లింగ్స్ పట్ల కోపంగా వ్యవహరిస్తారు, కొట్లాడతారు. పెద్దవాళ్లు అవుతున్న కొద్దీ వాళ్లలో మార్పు కనిపిస్తుంది.

పాదాలు పగలకుండా...

శీతాకాలంలో పాదాల పగుళ్లు చాలామందిలో ఎదురయ్యే సమస్య. దీనివల్ల నొప్పిగా ఉండడం, నడవడం ఇబ్బంది కావడమే కాదు... పాదాలు అందవికారంగా కూడా కనిపిస్తాయి. వాతావరణం కారణంగా ఈ సీజన్‌లో కాళ్ళు పొడిబారుతాయి. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే మడమల దగ్గర చర్మానికి పగుళ్ళు వస్తాయి. పాదాలను సరిగ్గా శుభ్రపరుచుకోకపోవడం, వాతావరణంలోని కాలుష్యం, మధుమేహం, సొరియాసిస్, థైరాయిడ్, చర్మ సంబంధమైన సమస్యల వల్ల పాదాలు ఎక్కువగా పగులుతూ ఉంటాయి. మొదట్లోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవచ్చు.

అవేమిటంటే...

పాదాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పొడిబారిన పాదాలపై దుమ్ము పేరుకుపోతే పగుళ్ళు రావడానికి ఆస్కారం ఉంటుంది. అలాగే పగుళ్ళలోకి దుమ్ము వెళితే ఇన్ఫెక్షన్లు రావచ్చు. కాబట్టి పాదాలను తరచూ శుభ్రం చేసుకోవాలి. తడి లేకుండా తుడుచుకోవాలి. సాక్సులు వేసుకుంటే మరింత రక్షణ ఉంటుంది.

నూనె చక్కటి మాయిశ్చరైజర్. పాదాలకు నూనె రాసుకొని, కాసేపు ఉంచాక కడుక్కుంటే, చర్మం పొడిబారకుండా నిరోధించవచ్చు. పగుళ్ళు రాకుండా కాపాడుకోవచ్చు. అలాగే నూనెతో మసాజ్ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

తులసి ఆకులు, వేపాకులను ఫంగస్, బ్యాక్టీరియా నివారిణులుగా పనిచేస్తాయి. వాటిని నూరి ముద్ద చేసి, కాస్త పసుపును కలిపి పాదాలకు రాసుకుంటే... పాదాలూ, మడమలూ మృదువుగా మారుతాయి. అంతేకాదు, పాదాలకు పగుళ్ళు పడి, వాటి నుంచి రక్తం వస్తున్నప్పుడు ఈ మిశ్రమాన్ని ఉపయోగిస్తే త్వరగా నయం అవుతుంది.

గ్లిజరిన్‌లో రోజ్‌వాటర్ కలిపి పాదాలకు రాస్తే పగుళ్ళు తగ్గుతాయి. నిద్రపోయే ముందు ఈ మిశ్రమాన్ని రాసి, రాత్రంతా అలా ఉంచేస్తే మంచిది. పగుళ్ళు తగ్గిన తరువాత మళ్ళీ ఆ సమస్య తలెత్తకుండా ఉండాలంటే గ్లిజరిన్-రోజ్‌వాటర్ మిశ్రమాన్ని రాస్తూ ఉండాలి.

ఇలా చేస్తే 'అధర'హెూనే!

ముఖారవిందం అదరాలంటే... అధరం దొండ పండులా మెరవాలి. మరి దాని కోసం ఏం చేయాలి? మార్కెట్‌లో దొరికే ఓ లిప్‌స్టిక్ తీసుకొచ్చేసి... పూసుకొంటే సరిపోదు. అలా చేస్తే ఉన్న అందం పోయి, వయసుకు మించి కనిపిస్తారు. అందుకే మన పెదాలకు నప్పేది... సున్నితమైన చర్మానికి హాని చేయనిది ఎంచుకోవాలనేది బ్యూటీషియన్ల

అలాగే అద్దవద్దు: మన పెదాలపై సున్నితమైన చర్మం ఉంటుంది. కనుక ఎక్కువ తేమను సంగ్రహించలేవు. దీంతో పెదాలు పొడిబారి పెచ్చుల్లా వస్తాయి. అది గమనించకుండా లిప్‌స్టిక్ వేసుకొంటే... మృదుత్వం పోయి, ముఖం మరింత కళావిహీనంగా తయారవుతుంది. అలాంటప్పుడు లిప్ స్క్రబ్‌తో మీ పెదాలను మృదువుగా చేసుకోండి. లేదంటే పెదాలపై వ్యాజ్‌లైన్ రాసి, బేబీ టూత్‌బ్రష్‌తో నిదానంగా రుద్దితే పొడిబారిన చర్మం తొలగిపోతుంది. ఆ తరువాత లిప్‌స్టిక్ ఉపయోగిస్తే పెదాలు చూడచక్కగా ఉంటాయి.

పొడిబారనీయద్దు: అప్పుడప్పుడూ కాకుండా పెదాల పోషణపై కూడా రోజూ శ్రద్ధ పెట్టాలి. పొడిబారకుండా మాయిశ్చరైజింగ్ చేస్తుండాలి. సాధారణంగా చాలా లిప్‌స్టిక్స్ మాయిశ్చరైజర్లుగా కూడా ఉపయోగపడతాయి. అలా కాని పక్షంలో లిప్‌బామ్ తీసుకోండి. అందులోని కొబ్బరి నూనె, వెన్న వంటివి మంచి మాయిశ్చరైజర్లుగా ఉపయోగపడతాయి. అలాంటిదే మరో ఉత్పత్తి లిప్ స్లీపింగ్ మాస్క్. పగిలినట్టుండే పెదాలను సజీవంగా మారుస్తుంది.

లిప్ లైనర్: లిప్ లైనర్లు వయసు మళ్లిన మహిళలకే అనుకొంటే పొరపాటే. నిజానికి లిప్ లైనర్ మీ పెదాల అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. అధరాలు కొట్టొచ్చినట్టు కనిపించడానికి హాలీవుడ్ మేకప్ ఆర్టిస్టులు కూడా తరచూ లిప్ లైనర్లు వాడుతుంటారు. అయితే మీ పెదాల రంగును బట్టే షేడ్స్ ఉపయోగిస్తే సరిగ్గా నప్పుతుంది. ఒకవేళ మీ పెదాలు విశాలంగా కనిపించాలంటే న్యూడ్ కలర్ షేడ్ అద్దాలి.

అతిగా వద్దు: ఒకవేళ లిప్‌స్టిక్ ఎక్కువైందనిపిస్తే... టిష్యూతో పైపైన అద్ది తొలగించవచ్చు. లేదంటే మూసివున్న పెదాల మధ్యలో నుంచి మీ వేలిని నోట్లో పెట్టి, నిదానంగా బయటకు లాగండి. అప్పుడు అదనంగా అద్దిన లిప్‌స్టిక్ మీ వేలికి అంటుకుని వచ్చేస్తుంది.

రబ్ చేయండి: లిప్‌స్టిక్ వేసుకున్న తరువాత దానిపై మృదువుగా రుద్దండి. దానివల్ల లిప్‌స్టిక్

స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య.. ఈ పీసీఓఎస్!

ఆమెకు ప్రపంచం తల్లకిందులు అయినట్లుంటుంది.

పేరుకే 'నెల'సరిగానీ అది ఎప్పుడొస్తుందో తెలీదు. వచ్చినప్పుడు అంతా గందరగోళం. మరోవైపు ముఖం మీద, ఒంటి మీద మగవారిలా అవాంఛిత రోమాలు. మొత్తం జీవితమే ఏదో అయోమయంలో పడినట్లు అనిపిస్తుంటుంది. నేడు ఎంతోమంది యుక్తవయసు ఆడపిల్లలు, స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య.. ఈ పీసీఓఎస్!

చాలామంది గడ్డాలు, మీసాల వంటి వాటినే చూసుకుంటూ వాటి గురించే ఎక్కువ ఆందోళన చెందుతుంటారుగానీ వాస్తవానికి పీసీఓఎస్ ఈ పైపై చికాకులకు మాత్రమే పరిమితమయ్యేది కాదు. మొత్తం ఆరోగ్యంపైన కూడా దీని ప్రభావం కొంత లోతుగా ఉంటుంది. వీరికి మధుమేహం, గుండె జబ్బుల వంటి ముప్పులు ఎక్కువగా ఉంటున్నాయని వైద్యరంగం ఇప్పుడు స్పష్టంగా హెచ్చరిస్తోంది. పైగా ఇది మిగిల్చే మానసిక వేదనా అనంతం. అయితే.. సమస్య ఇంత విస్తృతమైనదైనా.. దీన్ని సత్వరమే గుర్తించి చికిత్స తీసుకుంటే చాలా వరకూ ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. అందుకే దీనికి సంబంధించిన సమగ్ర వివరాలను మీ ముందుకు తెస్తోంది

పాలీ సిస్టిక్ ఓవరీ సిండ్రోమ్.. పీసీఓఎస్.. మన సమాజంలో ఎంతోమంది స్త్రీలు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇది! మహిళల్లో దాదాపు నూటికి ఐదుగురు దీంతో బాధపడుతున్నారని అంచనా. కొత్తగా రజస్వల అయిన యుక్తవయసు ఆడపిల్లల నుంచి నడి వయసు మహిళల వరకూ.. ఎంతోమంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. చూడటానికి, చెప్పుకోవటానికి ఇదొక వ్యాధిలాగా అనిపించకపోవటం 'పీసీఓఎస్' ప్రత్యేకత. నెలసరి అస్తవ్యస్తం కావటం.. అవాంఛిత రోమాలు పెరగటం.. గర్భం రాకపోవటం.. ఇలా లక్షణాలన్నీ వేర్వేరుగా కనిపిస్తుంటాయి. ఆ లక్షణాలన్నింటినీ కలిపి సమగ్రంగా చూస్తేనేగానీ.. వాటన్నింటికీ మూలం 'పీసీఓఎస్'లో ఉందని పట్టుకోలేం. అందుకే చాలామంది దీని విషయంలో రకరకాలుగా పొరబడుతుంటారు కూడా.

పైకి కనిపించే లక్షణాలకు తోడు.. దీనితో కనిపించని ముప్పులూ చాలానే ఉంటాయన్న విషయాన్ని విస్మరించకూడదు. చాలామంది పీసీఓఎస్ బాధితులకు అధిక బరువు/వూబకాయం కూడా ఉంటుంది. అలాగే చాలామందిలో హైబీపీ, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం, ఇన్సులిన్ నిరోధకత, భవిష్యత్తులో మధుమేహం వచ్చే అవకాశాల వంటి ముప్పులూ ఎక్కువే. అందుకే దీన్ని ఒక రుగ్మతగా, విస్తృత సమస్యగా అర్థం చేసుకోవటం అవసరం. నిజానికి పీసీఓఎస్ పూర్తిగా నయమైపోయే సమస్య కాదు. అయితే దీని కారణంగా తలెత్తే చికాకులన్నింటినీ చాలా వరకూ తగ్గించేందుకు ఇప్పుడు సమర్థమైన చికిత్సలున్నాయి. వీటితో పీసీఓఎస్ బాధితులు చాలా వరకూ పూర్తి సాధారణ జీవితం గడిపే వీలుంది.

లక్షణాల్లోనే ఉంది కీలకం!

- పీసీఓఎస్‌లో కనిపించే ప్రధాన లక్షణం- నెలసరి సరిగా రాకపోవటం. ఒక్కోసారి నెలల తరబడి కూడా రాకపోవచ్చు. ఏడాది మొత్తమ్మీద 8 కంటే తక్కువసార్లే వస్తుంటుంది. ఆ వచ్చినప్పుడు రుతుస్రావం చాలా ఎక్కువగా ఉండొచ్చు, ఎక్కువ రోజులూ ఉండొచ్చు.

- చర్మం జిడ్డు కారుతూ యుక్తవయసు దాటినా కూడా మొటిమలు వేధిస్తుంటాయి. అన్నింటినీ మించి అద్దంలో ముఖం చూసుకోవాలంటేనే ఇబ్బంది పెట్టేలా పెదాల మీద, చెంపల మీద.. వెంట్రుకలు పెరుగుతుంటాయి. ఏదో నూనూగుగా ఉంటే ఫర్వాలేదుగానీ క్రమేపీ గడ్డం, మీసం కాస్త దట్టంగా కూడా వస్తుంటాయి. మగవారిలా ఛాతీ మీద, పొట్ట మీద, మోచేతులు, తొడల లోపలి వైపు..చివరికి పొట్ట మీద మధ్యలో నిలువు గీతలా కూడా వెంట్రుకలు వస్తుంటాయి. ఇది చాలదన్నట్టు తల మీదేమో జుట్టు రాలిపోతుంటుంది.

- బరువు పెరిగి వూబకాయులుగా తయారవ్వచ్చు. కొందరిలో గర్భధారణ కూడా కష్టంగా తయారవుతుంది.

ఈ లక్షణాల్లో అన్నీ అందరికీ ఉండాల్సిన పని లేదు. కొన్ని ఉన్నా కూడా పీసీఓఎస్‌ను అనుమానించాల్సి ఉంటుంది. ఇవి రజస్వల అయిన తర్వాత యుక్తవయసులో ఎప్పుడైనా మొదలవ్వచ్చు. కొందరికి మొదట్లో అంతా బాగానే ఉన్నా క్రమేపీ బరువు పెరిగి, దాంతో సమస్యలు ఆరంభం కావచ్చు.

ఏమిటీ లక్షణాలు.. ఎందుకీ బాధలు?

పీసీఓఎస్‌ను అర్థం చేసుకోవాలంటే ముందు ప్రతినెలా స్త్రీ శరీరంలో ఏం జరుగుతుందో స్థూలంగా తెలుసుకోవటం అవసరం. ఆడపిల్లలకు పుట్టుకతోనే అండాశయాల్లో బోలెడన్ని కుదుళ్లు, వాటిల్లో సూక్ష్మరూపంలో అండాలు ఉంటాయి. సాధారణంగా ప్రతి నెలా అండాశయాల్లోని ఈ కుదుళ్లలో ఏదో ఒక్కటి పరిపక్వమై.. దాని నుంచి ఒక అండం బయటకు విడుదల అవుతుంటుంది. దీన్నే 'ఓవ్యులేషన్' అంటారు. కానీ 'పీసీఓఎస్' సమస్య ఉన్న స్త్రీలలో మాత్రం- నెలనెలా ఒక కుదురు పెద్దగా తయారై అండం పరిపక్వమవటానికి బదులు- చిన్నచిన్న కుదుళ్లు బోలెడన్ని సిద్ధమైపోతుంటాయి. వీటిలో నీరులాంటి స్రావం చేరి, ఇవి చిన్న చిన్న తిత్తుల్లా (సిస్ట్) తయారవుతాయి. అందుకే ఈ సమస్యను 'పాలీ సిస్టిక్' అంటారు. అయితే కుదుళ్లు ఇలా చాలానే సిద్ధమైనా.. చివరికి ఇవేవీ కూడా ఒక అండాన్ని పూర్తిగా పక్వానికి తీసుకొచ్చి బయటకు విడుదల చెయ్యలేవు. దీంతో వీరిలో ప్రతి నెలా క్రమం ప్రకారం 'అండం' పక్వం కావటం, విడుదల కావటమన్నది ఉండదు. ఫలితంగా నెలసరి అస్తవ్యస్తంగా తయారవుతుంది.

రెండోది- ఆ చిన్నచిన్న తిత్తులు ప్రమాదకరమైనవేం కాదుగానీ అవి అండాశయాల పనితీరును దెబ్బతీస్తాయి. దానివల్ల వీరిలో హార్మోన్లు అస్తవ్యస్తమైపోతాయి. చాలామంది- స్త్రీ హార్మోన్లు స్త్రీలల్లోనే ఉంటాయి, పురుష హార్మోన్లు పురుషుల్లోనే ఉంటాయని అనుకుంటుంటారుగానీ.. అది నిజం కాదు. వాస్తవానికి ఆడవారిలోనూ పురుష హార్మోన్లుంటాయి, పురుషుల్లోనూ స్త్రీ హార్మోన్లుంటాయి, కాకపోతే కాస్త తక్కువ మోతాదులో ఉంటాయి. కానీ పీసీఓఎస్ బాధితుల్లో అండాశయాల పనితీరు అస్తవ్యస్తం కావటం వల్ల- పురుష హార్మోన్లు (ఆండ్రోజెన్స్) కాస్త అధికంగా తయారవుతుంటాయి. వాటి ప్రభావం పెరిగిపోతుంది. దానివల్ల వీరిలో అండం విడుదల కాకపోవటమే కాదు.. మగవారిలాగా గడ్డాలు, మీసాలు, ఛాతీ వంటి ప్రదేశాల్లో కూడా పురుషుల్లా వెంట్రుకలు పెరగటం వంటివి మొదలవుతాయి. కొందరిలో తల మీద జుట్టు రాలిపోతూ మగవారిలా బట్టతల లక్షణాలు కనబడటమూ కనిపిస్తుంది.

మూడోది.. సాధారణంగా నెలనెలా గర్భాశయం లోపల గోడల వెంట పెరిగే ఎండోమెట్రియం పొర.. నెలసరి సమయంలో మొత్తం వూడిపోయి, రుతుస్రావం రూపంలో బయటకు వచ్చేస్తుంటుంది. అయితే పీసీఓఎస్ బాధితుల్లో నెలనెలా సక్రమంగా అండం విడుదల కావటం లేదు కాబట్టి.. గర్భాశయం లోపలి ఈ ఎండోమెట్రియం పొర కూడా పూర్తిగా విడివడదు. పైగా అది మందంగా తయారై అస్తవ్యస్తంగా వూడుతుంటుంది. అందుకని నెలసరి వచ్చినప్పుడు- రుతుస్రావం చాలా ఎక్కువగా కావటం, లేదూ చాలా ఎక్కువ రోజులు కావటం జరుగుతుంటుంది.

వీటినీ చూసుకోవాల్సిందే!

మధుమేహం ..పీసీఓఎస్ బాధితుల్లో తప్పకుండా పట్టించుకోవాల్సిన కీలకమైన సమస్య మధుమేహం. ఎందుకంటే వూబకాయం ఉన్నా, లేకున్నా, పీసీఓఎస్ బాధితుల్లో 65-80% మందికి 'ఇన్సులిన్ నిరోధకత' మాత్రం కచ్చితంగా ఉంటోందని అధ్యయనాల్లో గుర్తించారు. చాలామంది పీసీఓఎస్ బాధితుల్లో రక్తంలో ఈ ఇన్సులిన్ ఎక్కువగానే ఉంటోందిగానీ.. రక్తంలో గ్లూకోజు మాత్రం సరిగా నియంత్రణలో ఉండదు. ఇలాంటి వారు క్రమేపీ మధుమేహంలోకి వెళతుంటారు. కాబట్టి బరువు ఎక్కువగా ఉన్న పీసీఓఎస్ బాధితులకు లేదా పెద్దవయసులో పీసీఓఎస్ బారినపడిన వారికి, కుటుంబ చరిత్ర ఉన్నవారికి ఇన్సులిన్ నిరోధకత ఎలా ఉంది? మధుమేహం కూడా వచ్చిందా? అన్నది తేల్చుకునేందుకు గ్లూకోజు తాగించి చేసే రక్తపరీక్షను (జీటీటీ) తప్పనిసరిగా చూడాలి.

గుండె జబ్బు ..వూబకాయం, ఇన్సులిన్ నిరోధకత లేదా మధుమేహం వంటి సమస్యలున్న వారికి గుండెలోని రక్తనాళాలు మూసుకుపోయి, గుండె జబ్బువచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పీసీఓఎస్ బాధితులందరికీ ఈ గుండెపోటు ముప్పు ఎక్కువగా ఉంటుందా? లేదా? అన్నది కచ్చితంగా చెప్పలేకపోయినా పీసీఓఎస్‌తో పాటు వూబకాయంగానీ, మధుమేహంగానీ ఉన్న మహిళలు ఈ గుండె జబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. బరువు, ఇన్సులిన్ నిరోధకతలతో పాటు కొలెస్ట్రాల్ కూడా ఎక్కువగా ఉంటోందేమో పరీక్ష చేయించుకుని, అది ఎక్కువగా ఉంటే తగ్గించుకునేందుకు చికిత్స తీసుకోవటం అవసరం.

గురక, నిద్రలో శ్వాస సమస్య

పీసీఓఎస్ బాధితుల్లో కనీసం సగం మందికి నిద్రా సమయంలో మధ్యమధ్యలో 'శ్వాస' తీసుకోవటం ఇబ్బందికరంగా ఉంటోందని గుర్తించారు. దీన్నే 'స్లీప్ అప్నియా' అంటారు. దీనివల్ల నిద్రలో తరచూ మెలకువ వచ్చేస్తుంటుంది. ఇలా రాత్రి నిద్ర కరవై... పగలంతా విపరీతమైన అలసట, మత్తుగా ఉండటం వంటి లక్షణాలు మొదలవుతుంటాయి. ఈ రకం శ్వాస సమస్య ఉన్నవారిలో- ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె కొట్టుకునే లయలో తేడాల వంటి ఇతరత్రా ముప్పులూ పెరుగుతాయి. కాబట్టి పీసీఓఎస్ నిర్ధారణ అయినప్పుడు వారికి గురక వస్తోందా? పగటిపూట మగతగా అనిపిస్తోందా? వంటి లక్షణాల మీదా ధ్యాస పెట్టాలి.

కుంగుబాటు, ఆందోళన ...చాలామంది పట్టించుకోని విషయం ఇది. పీసీఓఎస్ అనేది మానసికంగా తీవ్ర వేదన మిగిల్చే సమస్య. దీనివల్ల ఎంతోమంది మానసికంగా కుంగుబాటు, ఆందోళన వంటివాటిలో కూరుకుపోతుంటారు. కాబట్టి వీటి గురించీ పట్టించుకోవటం, అవసరమైతే కౌన్సెలింగ్ ఇవ్వటం అవసరం.

క్యాన్సర్ ముప్పును మరువకూడదు

నెలసరి క్రమంగా రాకపోవటం, రుతుక్రమం అస్తవ్యస్తంగా తయారవటం వల్ల పీసీఓఎస్ బాధితుల్లో- ఎండోమెట్రియం పొర చాలా మందంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీన్నే 'ఎండోమెట్రియల్ హైపర్‌ప్లేసియా' అంటారు. అరుదుగానే అయినా కొందరిలో ఇది ఎండోమెట్రియం క్యాన్సర్‌కు కూడా దారి తియ్యొచ్చు. కాబట్టి అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి, ఎండోమెట్రియం పొర మందం ఎంత ఉంటోందీ పరిశీలించటం అవసరమని తాజా మార్గదర్శకాలు స్పష్టంగా చెబుతున్నాయి.

గర్భధారణ..పీసీఓఎస్ బాధితుల్లో గర్భధారణ అంత తేలిక కాదు. నిజానికి చాలామంది గర్భం ధరిస్తారు గానీ దానికి కొంత సమయం పట్టొచ్చు. బరువు ఎక్కువగా గలవారు దాన్ని తగ్గించుకుంటే నెలసరి క్రమబద్ధమై, గర్భధారణ అవకాశాలు మెరుగవుతాయి. బరువు తగ్గినా కూడా రుతుక్రమం గాడిలో పడకపోతే వైద్యులు అండాల విడుదల కోసం ప్రత్యేకంగా హార్మోన్ మాత్రలు, ఇంజెక్షన్ల వంటివి ఇస్తారు, దాంతో గర్భధారణ అవకాశాలు బాగా పెరుగుతాయి. అండాశయాల్లో తిత్తులు మరీ ఎక్కువగా ఉన్న వారికి ల్యాప్రోస్కోపీ విధానంలో సర్జరీ చేసి, ఈ తిత్తులను చిదిపెయ్యటం ద్వారా హార్మోన్ల అసమతౌల్యాన్ని బాగా తగ్గించొచ్చు. దీంతో గర్భధారణ అవకాశాలు బాగా మెరుగవుతాయి.

అలాగే గర్భధారణ తర్వాత వీరికి గర్భిణీ మధుమేహం వస్తోందేమో చూడటం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే పీసీఓఎస్ ఉన్న స్త్రీలకు 'గర్భిణీ మధుమేహం' వచ్చే ముప్పు రెండు రెట్లు ఎక్కువగా ఉంటోందని గుర్తించారు.

భాగస్వామ్యంతో విద్యుత్ ప్లాంట్లు

హైదరాబాద్- నవభూమి: రామగుం డంలో కొత్తగా నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్‌ప్లాంట్ విషయంలో జాయింట్ వెంచర్ విధానానికే రాష్ట్ర సర్కారు సై అన్నది. విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు ఎంతగా వ్యతిరేకించినా సింగరేణి సంస్థతో జట్టుకట్టేందుకు సిద్ధపడింది. సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంట్‌ను నిర్మించనున్నది. సింగరేణి, టీజీ జెన్‌కో సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నాయి.

ఈ ప్లాంట్ నిర్మాణంపై టీజీ జెన్‌కో, సింగరేణి సంస్థలు వారంలోగా విధివిధానాలు ఖరారుచేయాలని, నెలలోగా డీపీఆర్‌ను రూపొందించి సమర్పించాలని ప్రభుత్వం ఆయా సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్.. టీజీజెన్‌కో, సింగరేణి సంస్థల సీఎండీలకు శనివారం లేఖలు రాశారు. రాష్ట్రంలో విద్యుత్తు ప్లాంట్లను జెన్‌కో ద్వారానే నిర్మించి చేపడుతున్నారు. ఇప్పటివరకు 6,485 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను జెన్‌కో నిర్మించగా, ఇప్పుడు పవర్‌ప్లాంట్ల నిర్మాణంలో కొత్తగా జాయింట్‌వెంచర్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిసారి సింగరేణి సంస్థకు భాగస్వామ్యం కల్పిస్తున్నది. విధివిధానాలు, డీపీఆర్ తయారీ పూర్తికాగానే రెండు సంస్థల మధ్య ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. కాగా, సింగరేణి సంస్థ భాగస్వామ్యాన్ని విద్యుత్తు ఉద్యోగ, కార్మిక సంఘాలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేర కు పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం జాయింట్ వెంచర్ విధానానికే మొగ్గుచూపడం గమనార్హం.

పసిడి ప్రియులకు బ్యాడ్‌న్యూస్.. మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు..

న్యూఢిల్లీ- నవభూమి: బంగారం వెండి(ప్రియులకు బ్యాడ్ న్యూస్. ఎందుకంటే రెండో రోజు కూడా వీటి ధరలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో 10 గ్రాముల బంగారం ధర రూ. 810 పెరుగగా, కిలో వెండి ధర రూ. 400 పెరిగింది. ఈ నేపథ్యంలో నేడు (సెప్టెంబర్ 22, 2024న)ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 75,930కి చేరుకోగా, 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ. 69,600కి చేరింది.

మరోవైపు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 76,080కి చేరగా, 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 69,750కి చేరుకుంది. దీంతో దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న బంగారం, వెండి ధరలను ఇక్కడ చుద్దాం.

ప్రధాన ప్రాంతాల్లో గోల్డ్ రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్) (22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 75,930, రూ. 69,600
ముంబైలో రూ. 75,930, రూ. 69,600
ఢిల్లీలో రూ. 76,080, రూ. 69,750
విజయవాడలో రూ. 75,930, రూ. 69,600
వడోదరలో రూ. 75,980, రూ. 69,650
చెన్నైలో రూ. 75,930, రూ. 69,600
బెంగళూరులో రూ. 75,930, రూ. 69,600
కోల్‌కతాలో రూ. 75,930, రూ. 69,600

దేశంలోని ఇతర నగరాల్లో సిల్వర్ రేట్లు (కిలోకు)

చెన్నైలో రూ. 98000
ఢిల్లీలో రూ. 93000
ముంబైలో రూ. 93000
విజయవాడలో రూ. 98000
హైదరాబాద్‌లో రూ. 98000
బెంగళూరులో రూ. 85000
కేరళలో రూ. 98000
కోల్‌కతాలో రూ. 93000
అహ్మదాబాద్‌లో రూ. 93000
నోయిడాలో రూ. 93000
ఇండోర్‌లో రూ రూ. 93000
వడోదరలో రూ. 93000
జైపూర్‌లో రూ. 93000

పండుగల సీజన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి

న్యూఢిల్లీ- నవభూమి: పండుగల సీజన్ వచ్చేస్తుంది. ఈ నేపథ్యంలో దసరా, దీపావళికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉంది. దీంతో అనేక మంది ప్రజలు ఇప్పటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్(చేస్తున్నారు. దీనికి తోడు ఇ కామర్స్ సంస్థలు కూడా ఇప్పటికే ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. కిరాణా సామాగ్రి నుంచి మొదలుకుని బట్టలు, ఎలక్ట్రానిక్స్ వరకు ప్రజలు ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ ఆన్‌లైన్ షాపింగ్ సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, దీని ద్వారా మోసపోయే(ప్రమాదం కూడా ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.

మీరు షాపింగ్ చేసే విషయంలో ముందుగా మీరు కొనుగోళ్లు చేసేందుకు ప్రముఖ అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలి. తక్కువ రేటు ఉందని ఇతర సైట్లు ఇచ్చిన ఆఫర్లతో మోసపోవద్దు. ఎందుకంటే ఆయా సైట్లలో కొనుగోలు చేసిన తర్వాత మీకు సంబంధించిన ప్రొడక్ట్ రాకపోతే ఏం చేయాలో కూడా తెలియదు. కాబట్టి కస్టమర్ కేర్ సపోర్ట్, ప్రొడక్ట్ రిటర్న్ వంటివి ఇస్తున్నారా లేదా అనేది చెక్ చేసుకుని కొనుగోలు చేయాలి.

ఇమెయిల్ అలర్ట్

ఈ పండుగల సీజన్లలో సైబర్ నేరగాళ్లు మీ ఇన్‌బాక్స్‌కి ప్రత్యేక డీల్‌లను పంపించే అవకాశం ఉంటుంది. ఆ క్రమంలో ఆఫర్ లేదా డీల్స్ బాగున్నాయని మీరు దానిపై క్లిక్ చేసి మీ బ్యాంకు లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు అందిస్తే చిక్కుల్లో పడే అవకాశం ఉంటుంది. వీటి విషయంలో జాగ్రత్త వహించాలి.

పిన్ నంబర్‌ల వాడకం

అన్నింటి కంటే మొదటిది మీరు అన్ని పోర్టల్‌లలో ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించకూడదు. మీ పాస్‌వర్డ్ ఎప్పటికప్పుడు మార్చుతూ ఉంచండి. దీంతోపాటు మీ వ్యక్తిగత వివరాలను ఎవరితో షేర్ చేసుకోకూడదు. మీరు ఆన్‌లైన్ షాపింగ్ కోసం డెబిట్ లేదా క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగిస్తుంటే, ప్రతి మూడు నెలలకోసారి మీ పిన్ నంబర్‌ను మార్చుకోవాలి.

యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్

ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్‌తో పాటు మీ స్మార్ట్‌ఫోన్‌కు కూడా యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ అవసరం. స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా కొనుగోళ్లు పెరగడంతో మోసాలకు కూడా అవకాశం పెరిగింది. దీంతో నేరస్థులు మీ సిమ్, క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ వంటి వివరాలను హ్యాక్ చేసి దోచుకునే ఛాన్స్ ఉంది.

డౌన్‌లోడ్ చేసే క్రమంలో

యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అవి నుంచి ఉన్నాయే లేదో నిర్ధారించుకోండి. ఇటీవల కాలంలో అనేక ఫేక్ యాపులను ప్లే స్టోర్ నుంచి తొలగించారు. దీంతో దుండగులు వాటికి సంబంధించిన లింకులను అనేక మంది ఫోన్లకు పంపించి డౌన్‌లౌడ్ చేసుకునే విధంగా చేస్తున్నారు. వాటిని నమ్మి డౌన్ లోడ్ చేసుకుంటే ఇబ్బందులు తప్పవు.

షుమారు 3.4 మిలియన్ ట్రెండ్-ఫస్ట్ పండగ ఫ్యాషన్ స్టయిల్స్‌తో
మింత్రా బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ 26న ప్రారంభం

న్యూఢిల్లీ- నవభూమి: అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ తేదీలను మింత్రా ప్రకటించింది. ఈ 26 సెప్టెంబరు 2024న ప్రారంభం అవుతున్న బీఎఫ్ఎఫ్ ఎడిషన్‌కు బోట్ టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. ఈ ఉత్సవం సుమారు 3.4 మిలియన్ స్టైల్స్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇది దాని గత ఎడిషన్ కన్నా 47% వృద్ధిని సూచిస్తోంది. ఈ ఉత్సవాల్లో దేశీయ, అంతర్జాతీయ మరియు స్వదేశీ విభాగాలలో 9700ం కన్నా ఎక్కువ ప్రముఖ బ్రాండ్‌లు పాల్గొంటాయిబీ కేటగిరీలలోని ఉత్పత్తుల శ్రేణితో ఎంపికల కోసం వినియోగదారులు తప్పనిసరిగా ఎక్కువ సమయం కేటాయించవలసి ఉంటుంది. మింత్రా ఇన్సైడర్స్, మింత్రా లాయల్టీ ప్రోగ్రామ్ సభ్యులు సెప్టెంబరు 25వ తేదీన, 24 గంటల ముందుగానే బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్‌కి ముందస్తు యాక్సెస్ పొందుతారు.

వినియోగదారులకు గొప్ప విలువను అందించే వినూత్నమైన డీల్స్‌తో ఈ ఏడాది ఫ్యాషన్ ఫెస్టివల్ కొనసాగనుంది. అదనంగా, బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ ప్రత్యేక డీల్స్‌తో 'బ్రాండ్ ఆఫ్ ది డే'ని కలిగి ఉంటుంది. ఇది వినియోగదారులకు తమకు ఇష్టమైన బ్రాండ్‌ల నుంచి గతంలో ఎన్నడూ లేని విలువతో ఎంపికలను చేసుకునేందుకు అనుమతిస్తుంది. అత్యంత విలువతో నడిచే డీల్స్‌లో 'బై 1 గెట్ 4' ఉండగా, ఇది వినియోగదారులకు తమ హృదయపూర్వక కంటెంట్‌ను షాపింగ్ చేసేందుకు, పండుగ సీజన్‌లో వారి వార్డ్‌రోబ్‌లను రిఫ్రెష్ చేయడానికి అసమానమైన అవకాశాన్ని అందిస్తుంది.

విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందించే, వివిధ కేటగిరీల పరిధిలో నమ్మశక్యం కాని డీల్స్‌తో అందుబాటులోకి వస్తున్న ఈ పండుగ సీజన్ కోసం వినియోగదారులు చాలా ఉత్సాహంగా, ఆసక్తిగా వేచి చూస్తున్నారు. ఎవరైనా అధునాతన దుస్తులు, టైమ్‌లెస్ క్లాసిక్‌లు లేదా స్టేట్‌మెంట్ పీస్‌ల కోసం వెతుకుతున్నా, మింత్రా మెన్స్ అకేషన్ మరియు క్యాజువల్ వేర్ %ఉ% మహిళల ఎథినిక్, పాశ్చాత్య దుస్తులు, బ్యూటీ మరియు పర్సనల్ కేర్, హోమ్, పాదరక్షలు, ఆభరణాలు, గడియారాలు మరియు వేరబుల్స్‌తో సహా అనేక రకాల ఎంపికలను అందిస్తుంది.

మెరుగైన ఆఫర్లతో వినియోగదారులను ఆహ్లాదపరిచేందుకు, మింత్రా గత పండుగ సీజన్ నుంచి 3700 కొత్త బ్రాండ్‌లను జోడించింది. మింత్రా బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ సమయంలో ప్రత్యేకమైన హీరో కలెక్షన్లు కూడా అందుబాటులో ఉంటాయి.

బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ గురించి మింత్రా, రెవెన్యూ మరియు గ్రోత్ సీనియర్ డైరెక్టర్ నేహా వలీ మాట్లాడుతూ, "బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ ఈ ఎడిషన్ కేవలం షాపింగ్ గురించి మాత్రమే కాదుబీ ఇది మా వినియోగదారులకు పండుగ ఫ్యాషన్ అనుభవాన్ని పునర్నిర్వచించడమే. అసమానమైన స్టైల్స్ మరియు విలువతో -నడిచే ప్రతిపాదనలు, అంతర్జాతీయ, దేశీయంగా మా ఎంపికతో పాటుగా, దేశవ్యాప్తంగా విభిన్నమైన పండుగలను జరుపుకునే లక్షలాది మంది భారతీయులకు ఫ్యాషన్, బ్యూటీ మరియు జీవనశైలిని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. స్వదేశీ బ్రాండ్‌లు షాపింగ్ అనుభవాన్ని నిజంగా వేగవంతంగా మరియు ఆనందించేలా చేస్తాయి" అని వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించే సమయంలో, వినియోగదారులు తమ కొనుగోళ్లపై మరింత విలువను అన్‌లాక్ చేయడానికి కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో కలిసి మింత్రా కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగించి అదనంగా 7.5% ం5% తగ్గింపును పొందవచ్చు. ఫోన్‌పే నుంచి హామీ ఇవ్వబడిన క్యాష్‌బ్యాక్‌లతో పాటు, ఐసిఐసిఐ, కోటక్ మరియు యాక్సిక్ వంటి ఆర్థిక బ్యాంకుల ద్వారా, కొనుగోలుదారులు తమ పండుగ కొనుగోళ్లు చేసేటప్పుడు 10% వరకు తగ్గింపును కూడా పొందవచ్చు.

నెట్‌ఫ్లిక్స్‌పై వీసా ఉల్లంఘన.. పన్ను ఎగవేత.. వివక్ష ఆరోపణలు.. దర్యాప్తు చేపట్టిన హోంశాఖ..?

న్యూఢిల్లీ- నవభూమి: నెట్‌ఫ్లిక్స్.. ఓటీటీ లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పాపులర్ సంస్థ ఇది. అమెరికాకు చెందిన ఈ ఓటీటీ ప్లాట్ ఫామ్ అనుబంధ నెట్ ఫ్లిక్స్ ఇండియా సంస్థ నియంత్రణ నిబంధనలు, చట్టాలను ఉల్లంఘిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకించి వీసా నిబంధనల ఉల్లంఘన, జాతి వివక్ష వంటి చర్యలకు పాల్పడుతున్నదని వచ్చిన ఆరోపణలపై కేంద్రం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దేశీయంగా నెట్ ఫ్లిక్స్ వ్యాపార పద్ధతులపైనా దర్యాప్తు చేస్తున్నట్లు ఆ సంస్థ మాజీ ఉద్యోగికి పంపిన ఈ మెయిల్ లో కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పినట్లు సమాచారం.

2020లోనే నెట్ ఫ్లిక్స్ ఇండియా బిజినెస్ అండ్ లీగల్ అఫైర్స్ డైరెక్టర్‌గా తప్పుకున్న నందినీ మెహతాకు కేంద్ర హోంశాఖ అధికారి రాసిన లేఖతో నెట్ ఫ్లిక్స్ భారత్ ఆపరేషన్స్ మీద దర్యాప్తు చేస్తున్నట్లు అర్థమైంది. ఈ మేరకు గత జూలై 20న నందినీ మెహతాకు కేంద్ర హోంశాఖ అధికారి పంపిన మెయిల్ కూడా బయటకు వచ్చింది. వీసా నిబంధనల తోపాటు పన్ను నిబంధనలనూ నెట్ ఫ్లిక్స్ ఉల్లంఘిస్తోందని హోంశాఖ ఆధీనంలోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ అధికారి దీపక్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

'భారత్‌లో వ్యాపార నిర్వహణలో కంపెనీ ప్రవర్తనా నియమావళి, వీసా నిబంధనల ఉల్లంఘన, చట్ట విరుద్ధ నిర్మాణాలు, పన్ను ఎగవేత, జాతి వివక్ష వంటి చర్యలకు నెట్ ఫ్లిక్స్ పాల్పడుతున్నట్లు మాకు సమాచారం వచ్చింది. దీనిపై విచారణ చేపట్టాం' అని దీపక్ యాదవ్ తన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కేంద్ర హోంశాఖ నిర్ణయాన్ని నందినీ మెహతా స్వాగతించారు. దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. తన పట్ల జాతి, లింగ వివక్షకు పాల్పడుతూ తప్పుగా తనను తొలగించారని నందినీ మెహతా ఆరోపించారు. ఈ విషయమై నెట్ ఫ్లిక్స్ యాజమాన్యంపై కేసు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే, నందినీ మెహతా ఆరోపణలను నెట్ ఫ్లిక్స్ నిరాకరించింది. ఇక నందినీ మెహతాకు లేఖ రాసిన సంగతిపై స్పందించేందుకు దీపక్ యాదవ్ నిరాకరించారు. తనకు దీనిపై స్పందించే అధికారం లేదన్నారు. తమపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టిన విషయమై సమాచారం లేదని నెట్ ఫ్లిక్స్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

తమిళనాడు ట్రావెల్ ఎక్స్‌పో 2024 ప్రారంభం

మధురై- నవభూమి:: "తమిళనాడు దాని కలకాలం వారసత్వం, శక్తివంతమైన సంస్కృతి మరియు మరపురాని ప్రయాణాలతో భారతదేశం యొక్క అత్యంత విలువైన పర్యాటక గమ్యస్థానాలలో ఒకటిగా నిలుస్తుంది. తమిళనాడు యొక్క సాంస్కృతిక హృదయ స్పందనగా పిలువబడే మధురై, ఈ గొప్ప వారసత్వాన్ని ప్రదర్శించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లోతుగా పాతుకుపోయిన చరిత్ర, విస్మయం కలిగించే దేవాలయాలు మరియు ఆకట్టుకునే కథలతో, మదురై తమిళనాడు ట్రావెల్ ఎక్స్‌పోకు సరైన వేదికగా ఉపయోగపడుతుంది" అని భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రాంతీయ డైరెక్టర్ వెంకటేశన్ తమిళ ప్రారంభ సెషన్‌లో అన్నారు. నాడు ట్రావెల్ ఎక్స్‌పో 2024ని ట్రావెల్ క్లబ్-మధురై, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సౌత్ ఇండియా హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ తమిళనాడు టూరిజం డిపార్ట్‌మెంట్ మరియు భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ మద్దతుతో ఈరోజు మధురైలో నిర్వహించింది. "ట్రావెల్ మరియు హాస్పిటాలిటీ రంగాల నుండి వాటాదారులను నిమగ్నం చేయడం ద్వారా, మేము తమిళనాడు వారసత్వాన్ని హైలైట్ చేయడమే కాకుండా పర్యాటక రంగంలో కొత్త అవకాశాలను అన్వేషించే వేదికను నిర్మిస్తున్నాము. డెస్టినేషన్ వెడ్డింగ్‌లు మరియు వెల్‌నెస్ టూరిజం నుండి అడ్వెంచర్ మరియు మెడికల్ టూరిజం వరకు" అన్నారాయన. మదురై జిల్లాకు ప్రత్యేకమైన వెబ్‌సైట్ ప్రారంభ సెషన్‌లో ప్రారంభించబడింది, ఇది త్వరలో తమిళనాడులోని అన్ని ఇతర జిల్లాలను చేర్చడానికి అప్‌గ్రేడ్ చేయబడుతుంది. మరిన్ని వివరాల కోసం www.travel2tamil-nadu.comని క్లిక్ చేయవచ్చు లేదా హెల్ప్‌లైన్ నంబర్: 9500644898కి కాల్ చేయవచ్చు.

ఎ రూ.1.97 లక్షల కోట్లు పెరిగిన ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్.. ఐసీఐసీఐ.. హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు భారీ లబ్ధి..!



న్యూఢిల్లీ- నవభూమి: గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలోని టాప్-10 సంస్థల్లో ఆరు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,97,734.77 కోట్లు పెరిగింది. వాటిలో ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ భారీగా లబ్ధి పొందాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు (1.99 శాతం) లాభంతో ముగిసింది. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 1359.51 (1.63 శాతం) పాయింట్లు పుంజుకుని తాజా జీవిత కాల గరిష్టం 84,544.31 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతకుముందు ఇంట్రాడే ట్రేడింగ్ లో సెన్సెక్స్ 1509.66 పాయింట్ల వృద్ధితో 84,694.46 పాయింట్ల జీవిత కాల గరిష్ట స్థాయికి దూసుకెళ్లింది.

ఐసీఐసీఐ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.63,359.79 కోట్లు పుంజుకుని రూ.9,444,226.88 కోట్ల వద్ద స్థిర పడింది. హెచ్డీఎఫ్సీ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.58,569.52 కోట్లు వృద్ధి చెంది రూ.13,28,605.29 కోట్ల వద్ద ముగిసింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.44,319.91 కోట్ల లాభంతో రూ.9,74,810.11 కోట్ల వద్ద నిలిచింది. రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.19,384.07 కోట్లు లాభ పడి రూ.20,11,544.68 కోట్లకు దూసుకెళ్లింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎం-క్యాప్ రూ.10,725.88 కోట్ల లబ్ధితో రూ.7,00,084.21 కోట్లకు చేరింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.1,375.6 కోట్లు పుంజుకుని రూ.6,43,907.42 కోట్ల వద్ద ముగిసింది. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.85,730.59 కోట్ల నష్టంతో రూ.15,50,459.04 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.15,861.16 కోట్ల పతనంతో రూ.7,91,438.39 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14,832.12 కోట్లు పతనమై రూ.6,32,172.64 కోట్లకు చేరుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.7,719.79 కోట్లు నష్టపోయి రూ.6,97,815.41 కోట్ల వద్ద స్థిర పడింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతీ స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, హిందూస్థాన్ యూనీ లివర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఐటీసీ, ఎల్ఐసీ నిలిచాయి.

పార్లమెంట్ ఎన్నికల ఎఫెక్ట్.. తగ్గిన పెట్టుబడుల వ్యయం

హైదరాబాద్- నవభూమి: రాష్ట్రాల ఆర్థిక వృద్ధికి ప్రాణం పోసే మూలధన వ్యయంపై పార్లమెంట్ ఎన్నికలు తీవ్ర ప్రభావం చూపించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని గణనీయంగా తగ్గించాయి. గత తొలి త్రైమాసికంతో పోలిస్తే ఏపీ 88.7 శాతం, తెలంగాణ 40.4 శాతం పెట్టుబడి వ్యయాన్ని కుదించాయి. పెద్దమొత్తంలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) కలిగిన 15 రాష్ట్రాలకుగాను 10 రాష్ట్రాలు తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఖర్చులకు పెద్దమొత్తంలో కోతలు పెట్టాయి. పార్లమెంట్ ఎన్నికల కారణంగా పెట్టుబడుల వ్యయాన్ని ఆయా రాష్ట్రాలు భారీగా తగ్గించినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన డాటా విశ్లేషణలో వెల్లడైంది.

తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన పెట్టుబడి వ్యయం

ఆంధ్రప్రదేశ్‌లో 2023 జూన్ నాటికి పెట్టుబడుల ఖర్చు రూ.12,495 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ.1,417 కోట్లకు.. అంటే 88 శాతం తగ్గింది. తెలంగాణలో 2023 జూన్ నాటికి రూ.9,817 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ. 5,854 కోట్లకు.. అంటే 40 శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కూడా పెట్టుబడుల ఖర్చులో గణనీయమైన తగ్గుదల కనిపించింది. 2024 మొదటి త్రైమాసికం నాటికి రాష్ట్రాల పెట్టుబడుల ఖర్చు బడ్జెట్ నిష్పత్తి.. 5 శాతం నుంచి 20 శాతం మధ్యనే ఉన్నది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు బడ్జెట్‌లో కేటాయించిన నిష్పత్తుల కంటే పెట్టుబడుల ఖర్చులో తకువ శాతం నమోదు చేశాయి. మొదటి త్రైమాసికంలో 27 రాష్ట్రాల మొత్తం మూలధన వ్యయం గత సంవత్సరం కంటే గణనీయంగా తగ్గింది. జూలై నెలలో మాత్రం 6.8 శాతం పెరుగుదల నమోదైంది. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రాష్ట్రాల మూలధన వ్యయం 6.5 శాతం తగ్గింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తన మూలధన వ్యయంలో 35 శాతం కోత విధించింది.

ఇది రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకమే

రాష్ట్రాల్లో పెట్టుబడుల వ్యయం తగ్గుదలకు ప్రధాన కారణం సార్వత్రిక ఎన్నికలు అని ఆర్థిక నిపుణుడు సుజన్ హజ్రా అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ధోరణి కనిపించిందని తెలిపారు. రాష్ట్రాల మూలధన వ్యయంలో తగ్గుదల రాష్ట్రాల అభివృద్ధిని పెద్ద ఎత్తున దెబ్బతీస్తుందని, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు సృష్టి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

టాప్ 15 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు 2024-25 తొలి త్రైమాసికంలో మూలధన వ్యయం తగ్గుదల ఇలా ఉంది

ఆంధ్రప్రదేశ్: -88.7%
తెలంగాణ: -40.4%
గుజరాత్: -25.5%
ఛత్తీస్‌గఢ్: -19.0%
హర్యానా: -17.0%
మధ్యప్రదేశ్: -15.2
ఉత్తరప్రదేశ్: -12.6%
కేరళ: -8.4%
బీహార్: -5.2%
తమిళనాడు: -3.0%

వృద్ధి చూపిన రాష్ట్రాలు

ఒడిశా: ం3.6%
మహారాష్ట్ర: ం17.2%
పంజాబ్: ం92.3%
అస్సాం: ం126.0%
కర్ణాటక: ం134.5%

(జూన్ 2023 నుంచి జూన్ 2024 వరకు వృద్ధి శాతాలు)

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 | హైదరాబాద్ సోమవారం 23, సెప్టెంబర్, 2024

గోల్డ్ లోన్.. జిగేల్!

న్యూఢిల్లీ– నవభూమి: తనఖా రహిత వ్యక్తిగత రుణ నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కఠినతరం చేసిన నేపథ్యంలో బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫసీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. ఇందుకు తోడు, గడిచిన ఏడాది కాలంలో పసిడి ధర దాదాపు 25% పెరగడం, రుణదాతలు డిజిటల్ రుణ సౌకర్యాలను అందుబాటులోకి తేవడంతో గోల్డ్ లోన్ వ్యాపారం జోరందుకుంది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఎన్‌బీఎఫసీల బంగారం రుణ వ్యాపారం గడిచిన ఏడాది కాలంలో 20–30% పుంజుకుంది. ప్రస్తుతం ఈ వ్యాపారంలో ఎన్‌బీఎఫసీలదే పైచేయి అయినప్పటికీ, బ్యాంక్‌ల పసిడి రుణాలు గణనీయంగా పెరిగాయి. ఈ ఏడాది జూన్ నాటికి బ్యాంక్‌లిచ్చిన పసిడి రుణాల విలువ వార్షిక ప్రాతిపదికన 30% పెరిగి రూ.1,23,776 కోట్లకు చేరుకుంది. కాగా, తనఖా రహిత వ్యక్తిగత రుణాల వృద్ధి మందగించింది. ఈ జూన్‌లో ఈ విభాగ రుణాల వృద్ధి 15 శాతానికి పరిమితమైంది. 2023 జూన్‌లో నమోదైన 30% వృద్ధితో పోలిస్తే సగానికి తగ్గింది.%ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో పసిడి రుణ బకాయిలు వృద్ధి వేగంగా పెరిగింది. ఈ మే నెలలో 15 శాతం వృద్ధి నమోదైంది.

ఐఎండీ అలర్ట్.. వచ్చే 3 రోజులు మళ్లీ వర్షాలు

న్యూఢిల్లీ– నవభూమి: ప్రస్తుతం యాగీ తుపాను ప్రభావంతో భారత్‌లో పలుచోట్ల వర్షాలు(%తీఖఅఅం%) కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 30 నాటికి రుతుపవనాలు పూర్తిగా తిరుగుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు. కాగా రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, జార?ండ్, కేరళ, తమిళనాడు, గుజరాత్ సహా కోస్తా రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని అప్రమత్తం చేసింది.

ఈ క్రమంలోనే నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లో ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ ప్రాంతాలతో పాటు ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటకలోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఢిల్లీ, యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానాలలో కూడా వానలు పడతాయని అంచనా వేసింది. దీంతోపాటు కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం సూచనలు ఉన్నాయి.

వచ్చే మూడు రోజులు

ఈ నేపథ్యంలో వచ్చే 3 రోజుల పాటు ఢిల్లీలో భారీ వర్షాలు కురిసే అవకాశం లేకున్నా, చిన్నపాటి వర్షం కురిసే ఛాన్స్ ఉందన్నారు. దీంతోపాటు వచ్చే రెండు రోజులు తెలుగు రాష్ట్రాల్లో కూడా వానలు కురియనున్నాయి. ఇక సెప్టెంబరు 25, 26 తేదీల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన హెచ్చరికలను ఐఎండీ జారీ చేసింది.

500 శిబిరాల్లో

పశ్చిమ బెంగాల్ వరదల వలయంలో చిక్కుకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గినప్పటికీ, రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో చాలా భాగం ఇప్పటికీ నీటిలో మునిగిపోయింది. హౌరా, హుగ్లీ, పశ్చిమ మేదినీపూర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పరిస్థితి భయానకంగా ఉంది. వరదల్లో చిక్కుకున్న ప్రజలు సహాయక శిబిరాల్లో గడుపుతున్నారు. ప్రస్తుతం 500 సహాయక శిబిరాల్లో 10,000 మందికి పైగా ప్రజలు తలదాచుకున్నారు.

వర్షాల ప్రభావం

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని 21 జిల్లాల్లోని 500కు పైగా గ్రామాలు వరదల్లో మునిగిపోయాయి. గంగా, యమున, ఘఘ్రా, శారదా, సరయూ నదులు పెద్ద ఎత్తున ప్రవహిస్తున్నాయి. షాజహాన్‌పూర్‌లోని రాష్ట్ర రహదారిపై నీరు ప్రవహిస్తోంది. నీట మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. హిమాచల్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్ ప్రాంతాల్లో కూడా వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. బీహార్‌లో వర్షాల కారణంగా భాగల్‌పూర్, ముంగేర్, బెగుసరాయ్‌లో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముంగేర్‌లోని చండికా గర్భగుడి, పాట్నాలోని %చీ%–31, భాగల్‌పూర్‌లోని తిల్కామాంఝీ విశ్వవిద్యాలయం నీటిలో మునిగిపోయాయి.

రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్లు, డిటోనేటర్లు.. తృటిలో తప్పిన రైలు ప్రమాదం

న్యూఢిల్లీ– నవభూమి: దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై గ్యాస్ సిలిండర్లు, డిటోనేటర్లు, సిమెంట్ దిమ్మలు ఇంకా ప్రత్యక్షమవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో కాన్పూర్ సమీపంలోని ప్రేమ్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలెండర్‌ను ఆదివారం రైల్వే లోకో పైలట్ గమనించారు. దీంతో రైలును లోక్ పైలట్ ఆపేశారు. అనంతరం రైల్వే శాఖ ఉన్నతాధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ట్రాక్ వద్దకు చేరుకున్నారు.అయితే ట్రాక్‌పై గుర్తించిన గ్యాస్ సిలండర్ ఖాళీదని ఈ సందర్భంగా వారు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సెప్టెంబర్ 8వ తేదీన రైల్వే ట్రాక్‌పై గ్యాస్ సిలిండర్ కారణంగా ప్రయాగ్ రాజ్ నుంచి బివానీ వెళుతున్న కాళింది ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన సంగతి తెలిసిందే.ఇంకోవైపు మధ్యప్రదేశ్‌లోని బ్రుహన్‌పూర్ జిల్లాలో గత బుధవారం రైల్వే ట్రాక్‌పై 10 డిటోనేటర్లును లోక్ పైలట్ గుర్తించి రైలును ఆపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. జమ్మూ కశ్మీర్ నుంచి కర్ణాటకకు ఆర్మీ జవాన్లతో వెళ్తున్న ఈ ప్రత్యేక రైలు లక్ష్యంగా ఈ డిటోనేటర్లు అమర్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో తీవ్రవాద వ్యతిరేక దళం, జాతీయ దర్యాప్తు సంస్థతోపాటు స్థానిక పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు. దేశంలో ఇప్పటికే పలు రైలు ప్రమాదాలు చోటు చేసుకోన్నాయి. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తాయి. అలాంటి వేళ.. రైలు ప్రమాదాలను నిరోధించేందుకు కేంద్రం పలు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులోభాగంగా రైల్వే ఉన్నతాధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.

దాదాపు 7 కోట్లకు చేరిన అటల్ పెన్షన్ యోజన సబ్‌స్క్రైబర్ల సంఖ్య

న్యూదిల్లీ –నవభూమి ఇంటర్నెట్ డెస్క్: వృద్ధాప్యంలో ఆర్థికంగా ఆసరా ఇచ్చే అటల్ పెన్షన్ యోజన పథకం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 6.9 కోట్లకు చేరినట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పేర్కొన్నారు. పెన్షన్ ఫండ్ నిధి రూ.35,149 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు. "2015లో ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి 6.9 కోట్ల మంది అటల్ పెన్షన్ యోజన పథకం లబ్ధిదారులుగా మారారు. పెన్షన్ ఫండ్ రూ.35,149కి చేరింది" అని ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రారంభోత్సవంలో మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

తక్కువ ఖర్చుతో పింఛను సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం లబ్ధిదారులకు 60 ఏళ్లు దాటాక నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ అందుతుంది. లబ్ధిదారులు పథకంలో పెట్టిన పెట్టుబడిని బట్టి వచ్చే పింఛను ఆధార పడి ఉంటుంది. పెన్షన్ సబ్‌స్క్రైబర్ మరణించిన పక్షంలో వారి భాగస్వామికి ఈ పింఛను అందజేస్తారు. సబ్‌స్క్రైబర్‌తో పాటు వారి జీవితభాగస్వామి కూడా మరణిస్తే వారి సంతానానికి పెన్షన్ కార్పస్‌ను పూర్తిగా అందజేస్తారు.

జమిలి దేశానికే ముప్పు: కమల్‌హాసన్

చెన్నై– నవభూమి: 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం దేశానికే ముప్పు కలిగిస్తుందని ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్‌నీదిమయ్యం' పార్టీ అధినేత కమల్‌హాసన్ పేర్కొన్నారు. శనివారం చెన్నైలో జరిగిన పార్టీ ద్వితీయ సర్వసభ్యమండలి సమావేశం కమల్‌కే మళ్లీ పగ్గాలు అప్పగిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమని, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అభిప్రాయపడ్డారు. తమిళుడు ప్రధాని కావాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా పార్టీ బలోపేతానికి ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ 5 వేల మందిని సభ్యులుగా చేర్చాలని పార్టీ తీర్మానం చేసింది.

పొగాకు వ్యతిరేక ప్రకటనలు ఓటీటీల్లోనూ తప్పనిసరి

న్యూఢిల్లీ– నవభూమి: ఓటీటీ ప్లాట్‌ఫాంలలో పొగాకు వ్యతిరేక ప్రకటనలను తప్పనిసరి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. సినిమా ఆరంభంలో, మధ్యలోనూ 30 సెకన్ల నిడివికి తగ్గకుండా పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ఆడియో, వీడియో ప్రకటనలు, 20 సెకన్ల నిడివితో బిల్‌బోర్డు లేదా నిశ్చల ప్రకటనలు ఉండాలని పేర్కొంది. ఓటీటీ వినియోగదారు ఆ ప్రకటనలను తప్పించడానికి వీలులేని విధంగా పొందుపరచాలని సూచించింది. సెప్టెంబరు 1, 2023 తరువాత సీబీఎఫసీ సర్టిఫికెట్ పొందిన ప్రతి సినిమాకూ పైన పేర్కొన్న ప్రకనటలను జత చేయాలని పేర్కొంది.

జగన్ ఇంటి వద్ద ఉద్రిక్తత.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు

తాడేపల్లి– నవభూమి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం రోజురోజుకూ ముదురుతోంది. లడ్డూ ప్రసాదంలో అపచారం చోటుచేసుకున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం చెబుతుండడంతో అన్నివర్గాల్లోనూ ఆగ్రహం కనిపిస్తోంది. దోషులను వదలకుండా.. మరోమారు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ దుర్ఘటనపై ప్రపంచవ్యాప్తంగా హిందూలోకం గొంతెత్తుతోంది. తిరుమల దేవస్థానాన్ని అపవిత్రం చేశారని.. తిరుమల గొప్పతనాన్ని దెబ్బతీశారని నిలదీస్తున్నారు. రాజకీయ పరంగానూ అన్ని పొలిటికల్ లీడర్ల నుంచి వాయిస్ వినిపిస్తోంది. తాజాగా.. బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ఆదివారం హైడ్రా వారం తాడేపల్లిగూడెంలోని మాజీముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నివాసాన్ని ముట్టడించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. దాంతో పోలీసులు వారిని కట్టడి చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. కాగా.. ఇప్పటికే లడ్డూ ప్రసాదం వివాదంపై బీజేపీ నేతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. సరైన విధంగా విచారణ జరిపించి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అటు.. అగ్రనేత అమిత్ షా,నడ్డా కూడా ఈ అంశంపై రియాక్ట్ అయ్యారు. తాజాగా.. జగన్ నివాసాన్ని ముట్టడించారు.

బయటపడ్డ విద్రోహ చర్య.. తప్పిన భారీ ప్రమాదం

న్యూఢిల్లీ– నవభూమి: ఈ మధ్య రైలు ప్రమాదాలు భయానికి గురిచేస్తున్నాయి. ఏటా రైలు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడుతుండడంతో రైలు ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కారణాలు ఏవైనా నెలకో ప్రమాదాన్ని మాత్రం చూస్తునే ఉన్నాం. అదృష్టవశాత్తూ భారీ ప్రాణనష్టం జరగకున్నా.. రైల్వే శాఖకు మాత్రం పెద్ద ఎత్తున నష్టం వస్తోంది. కొన్ని రైళ్లు పట్టాలు తప్పి ప్రమాదాల బారిన పడుతుంటే.. మరికొన్ని రైళ్లు కొందరి ఆకతాయిల పనులతో యాక్సిడెంట్లకు గురవుతున్నాయని తెలుస్తోంది. గతంలో విశాఖపట్నం– అమృత్‌సర్ హిరాకుడ్, కాంచన్‌జుంగ, హౌరా– ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్, వారణాశి జంక్షన్–అహ్మదాబాద్ సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదాలకు గురయ్యాయి. తాజాగా ఓ కుట్రకోణం బయటపడింది. రైలును ప్రమాదంలో పడేందుకు చేసిన కుట్ర వెలుగు చూసింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టాలపై ఉన్న గ్యాస్ సిలిండర్‌ను పసిగట్టిన పైలెట్ వెంటనే రైలును నిలిపివేశాడు. ఎమర్జెన్సీ బ్రేక్ వేయడం వల్ల సిలిండర్‌కు అత్యంత సమీపం వరకు వచ్చి రైలు ఆగిపోయింది. ఒకవేళ పైలెట్ అప్రమత్తంగా లేకుంటే ఆ గూడ్స్ రైలుకు ప్రమాదం తప్పేది కాదు. కాన్పూర్–ప్రయాగ్ రాజ్ మార్గంలో ఈ గూడ్స్ నడుస్తోంది. ప్రేమ్‌పూర్ స్టేషన్ సమీపంలోకి రాగానే పట్టాలపై గ్యాస్ సిలిండర్ కనిపించింది. సమాచారం తెలుసుకున్న రైల్వే భద్రతా సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వెంటనే డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే సిలిండర్‌ను పట్టాలపై వదిలినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణకు ఆదేశించినట్లు నార్త్ సెంట్రల్ రైల్వే పేర్కొంది.

అమెరికాలో పెరుగుతున్న గన్ కల్చర్..

న్యూఢిల్లీ– నవభూమి: ఇప్పటికే అమెరికాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుండగా.. మరోవైపు తుపాకుల మోత మోగుతోంది. ప్రపంచ అగ్రదేశం అమెరికాలో రోజురోజుకూ తుపాకీ కల్చర్ పెరుగుతోంది. నిత్యం ఎక్కడో ఒక చోట దుండగులు తెగబడుతున్నారు. నిత్యం అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న మాజీ అధ్యక్షుడు ట్రంప్ పైన కూడా ఇటీవల రెండు సార్లు గన్ అటాక్ జరిగింది. తాజాగా మరోసారి అమెరికాలో కాల్పుల మోత మోగింది. నిన్న రాత్రి అలబామా రాష్ట్రంలో ఈ కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు చనిపోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో ప్రజలు ఎటూ తప్పించుకోలేకపోయారు. ఈ ఘటనలో స్పాట్‌లోనే ఇద్దరు పురుషులు, ఓ మహిళ చనిపోయారు. మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పలువురు గాయ పడగా.. వారిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసు లు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులే ఈ కాల్పులకు పాల్పడినట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. అలబామా యూనివర్సిటీకి దగ్గరలోనే ఈ కాల్పులు జరిగాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాన్ని దుండగులు టార్గెట్ చేశారని తెలిపారు. గతంలోనూ జార్జియాలోని ఓ పాఠశాలపై కాల్పులు కలకలం రేపాయి. జార్జియా బారో కౌంటీలోని ఓ హైస్కూల్‌లో ఈ ఘటన జరుగగా.. ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. అలాగే.. గత నెలలో ఇదే అలాబామా రాష్ట్రంలో జరిగిన కాల్పుల్లో తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం.

ఏడు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ– నవభూమి: దేశంలోని ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జులై 11న చేసిన సిఫార్సుల్లో కొన్నింటిని సవరిస్తూ మంగళవారం సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకోవడంతో ఈ నియామకాలు జరిగాయి. ఇవికాకుండా హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస.రామచంద్ర రావును ఝార?ండ్ హైకోర్టుకు బదిలీ చేసింది. జస్టిస్ రావును ఝార?ండ్ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్ హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిసగా పదోన్నతి పొందారు. ఇదే హైకోర్టుకు చెందిన జస్టిస్ సురేష్ కుమార్ కైత్ మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ నితిన్ మధుకర్ జమ్‌దార్ కేరళ హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు. బాంబే హైకోర్టుకే చెందిన జస్టిస్ కె.ఆర్.శ్రీరాం మద్రాసు హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న మేఘాలయ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. జమ్మూ–కశ్మీర్–లద్దాఖ్ హైకోర్టు జడ్జి జస్టిస్ తాషి రబస్టాన్ అదే హైకోర్టులో సీజేగా విధులు నిర్వర్తించనున్నారు. ఆయన లద్దాఖ్ ప్రాంతానికి చెందిన తొలి ప్రధాన న్యాయమూర్తి కానుండడం విశేషం.

భూమి వైపుగా దూసుకొస్తున్న ఆస్ట్రాయిడ్ అపోఫిస్..!

దిశ మారితే విధ్వంసం తప్పదంటూ శాస్త్రవేత్తల ఆందోళన..!

న్యూఢిల్లీ– నవభూమి: విశ్వంలో గ్రహశకలం దూసుకెళ్తుంటాయి. వీటికి స్థిరమైన మార్గం, గమ్యం లేకుండా సంచరిస్తుంటాయి. వీటి నుంచి భూమికి ముప్పు పెంచి ఉన్నది. ఇప్పటికే గ్రహశకలాలు భూమి దిశగా దూసుకువచ్చి మండిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. చిన్న చిన్న గ్రహశకలాలు కావడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే, భారీ గ్రహశకలాలు భూమిని ఢీకొడితే విధ్వంసం తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తాజాగా భారీ గ్రహశకలం భూమికి దగ్గరగా రాబోతున్నది. ఈ గ్రహశలం పేరు అపోఫిస్. దీనికి 'గాడ్ ఆఫ్ డిస్ట్రాక్షన్' పేరు కూడా ఉన్నది. ఈ గ్రహశకలానికి ఈజిప్ట్‌కు చెందిన అపెప్ దేవుడి పేరు పెట్టారు. అయితే, ఈ ఆస్టరాయిడ్ 2029లో భూమికి అత్యంత సమీపంలోకి రానున్నది.

కేవలం 30,600 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలాన్ని నేరుగా కంటితో చూడవచ్చని చెప్పారు. అపోఫిస్ ఆస్టరాయిడ్ మరికొన్ని చిన్న గ్రహశకలాలను ఢీకొట్టుకుంటూ వెళ్తే తన మార్గాన్ని మార్చుకునేందుకు అవకాశం ఉందని తాజాగా పరిశోధనల్లో తేలిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూమి వాతావరణంలోకి ప్రవేశించే అవకాశాలు లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆస్టరాయిడ్ 1230 అడుగుల వెడెల్పు.. దాదాపు మూడున్నర ఫుట్‌బాల్ మైదానాల విస్తీర్ణానికి సమానంగా ఉంటుందని పేర్కొన్నారు. దాంతో ఈ గ్రహశకలం భూమిని ఢీకొంటే భారీ విధ్వంసం ఏర్పడుతుందని.. అయితే, ఇలా జరిగేందుకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇందులో ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రహశకలం భూమిని తాకే అవకాశాలు చాలా తక్కువ అని అధ్యయనం రచయిత యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ అంటారియో ఖగోళశాస్త్రవేత్త పాల్ వీగెర్ట్ పేర్కొన్నారు.2029లో.. ఆ తర్వాత భవిష్యత్‌లో భూమిని ఢీకొట్టే మార్గంలో మరో గ్రహశకలం అపోఫిస్‌ను ఢీకొట్టే అవకాశం మిలియన్‌లో ఒకటి మాత్రమేనని.. చిన్న గ్రహశకలమైనా అపోఫిస్ మార్గాన్ని ప్రమాదకరంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలం 2029లో భూమికి దగ్గరగా వస్తుందని.. ఈ క్రమంలో చిన్న గ్రహశకలాలను ఢీకొట్టే అవకాశం ఉందన్నారు. ఈ గ్రహశకలాన్ని 2004లో గుర్తించారు. ఈ ఆస్ట్రరాయిడ్ భూమిని ఢీకొట్టేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తాకే అవకాశాలు తక్కువగానే ఉన్నా.. ఢీకొట్టే అవకాశాలను తోసిపుచ్చేందుకు అవకాశం లేదన్నారు. ఆస్ట్రాయిడ్ పేరు అపోఫిస్ 99942. ఇది ప్రమాదకరమైన ఆస్ట్రరాయిడ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నది.

బొగ్గు గనిలో పేలుడు.. 51 మంది మృతి

టెహ్రాన్–నవభూమి: బొగ్గు గనిలో పేలుడు సంభవించింది. మీథేన్ గ్యాస్ లీక్ కారణంగా జరిగిన ఈ పేలుడులో రెండు బ్లాకుల్లో పని చేస్తున్న 51 మంది కార్మికులు మరణించారు. మరో 20 మంది కార్మికులు గాయపడ్డారు. మృతదేహాలను వెలికి తీసేందుకు, గాయపడిన కార్మికులను బయటకు తెచ్చేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇరాన్‌లోని దక్షిణ ఖొరాసన్ ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 9 గంటలకు మదంజూ కంపెనీ నిర్వహిస్తున్న బొగ్గు గనిలోని బీ, సీ బ్లాకుల్లో మీథేన్ గ్యాస్ రిలీజ్ కావడంతో పేలుడు జరిగినట్లు సౌత్ ఖొరాసన్ ప్రావిన్స్ గవర్నర్ అలీ అక్బర్ రహీమి తెలిపారు. సుమారు 51 మంది కార్మికులు మరణించగా మరో 20 మంది గాయపడినట్లు మీడియాతో అన్నారు. కాగా, బీ బ్లాక్‌లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిందని రహీమీ తెలిపారు. ఈ బ్లాక్‌లో పని చేసిన 47 మంది కార్మికుల్లో 30 మంది మరణించారని, మరో 17 మంది గాయపడ్డారని చెప్పారు. సీ బ్లాక్‌లో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయని అన్నారు.

ఈ బ్లాక్‌లో మీథేన్ సాంద్రత ఎక్కువగా ఉందని, రెస్క్యూ ఆపరేషన్‌కు ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పేలుడు సమయంలో ఈ బ్లాక్‌లో 69 మంది కార్మికులు ఉన్నట్లు చెప్పారు. గాయపడిన 17 మందిని ఆసుపత్రికి తరలించామని, 24 మంది మిస్ అయ్యారని వెల్లడించారు. మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

కార్తీ సత్యం సుందరం తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ షెడ్యూల్ ఇదే..!

కోలీవుడ్ స్టార్ యాక్టర్లు కార్తీ, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం మెయ్యళగన్. 96 ఫేం ప్రేమ్ కుమార్ సీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని తెలుగులో 'సత్యం సుందరం' పేరుతో విడుదల చేస్తుండగా.. సెప్టెంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. కాగా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది కార్తీ టీం.తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ మూవీ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 23న నిర్వహించనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సాయంత్రం 6 గంటల నుంచి ఈవెంట్ షురూ కానుంది. కార్తీ, అరవింద్ స్వామితోపాటు చిత్రయూనిట్ ఈవెంట్‌లో సందడి చేయనున్నారు. ఈ చిత్రాన్ని హెూం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్య- జ్యోతిక రాజశేఖర్ కర్పూరసుందరపాండ్యన్‌తో కలిసి సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.నిర్మిస్తుండగా.. రాజ్ కిరణ్, శ్రీదివ్య, స్వాతి, దేవదర్శిణి, జయప్రకాశ్, శ్రీరంజిని ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 96 ఫేం గోవింద్ వసంత సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. తమిళంలో సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు డ్యాన్స్ చేసిన మృణాల్ ఠాకూర్..

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్‌బాబు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం గుంటూరు కారం . ఈ సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాట ఎంత ఫేమస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహేశ్‌బాబు, శ్రీలీల ఊరమాస్ స్టెప్పులతో థియేటర్లలో మోత మొగించింది ఈ పాట. ఇప్పటికే ఈ పాటకు కోలీవుడ్‌తో పాటు మాలీవుడ్ సెలబ్రిటీలు స్టెప్పులు వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాటకు టాలీవుడ్ భామ సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ డ్యాన్స్ చేసింది.
రీసెంట్‌గా ఓ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మృణాల్ ఠాకూర్ 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు స్టెప్పులేసింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సినిమాల విషయానికి వస్తే.. ప్రభాస్ కల్కి సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించిన ఈ భామ ప్రస్తుతం వరుసగా బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమాలతో పాటు తుమ్ హి హెూ సినిమాలతో ఈ భామ బిజీగా గడుపుతుంది.

మృణాల్ ఠాకూర్

ఆర్‌టీ 75 క్రేజీ న్యూస్.. రవితేజ ఫస్ట్ లుక్, టైటిల్ అనౌన్స్‌మెంట్ అప్పుడే..!

ధమాకా సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది టాలీవుడ్ క్రేజీ కాంబో రవితేజ శ్రీలీల ఈ ఇద్దరి కలయికలో రవితేజ బెంచ్ మార్క్ ప్రాజెక్ట్ రవితేజ 75 వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా షురూ అయింది. కాగా చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తిక విషయాలు నెట్టింట రౌండప్ చేస్తున్నాయి.తాజా టాక్ ప్రకారం ఆర్‌టీ 75 టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ దసరా సందర్భంగా ఉండబోతుందట. అంతేకాదు ఇందులో రవితేజ మరోసారి పోలీసాఫీసర్‌గా కనిపించబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. లేటెస్ట్ వార్తల ప్రకారం ఈ ప్రాజెక్ట్ షూటింగ్ 40 శాతం పూర్తవగా.. నెక్స్ట్ షెడ్యూల్ అక్టోబర్ మొదటివారంలో షురూ కానుందని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఈ షెడ్యూల్ మూడు వారాలపాటు కొనసాగనుందట. ఈ చిత్రంలో రవితేజ ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని ఫిలింనగర్ సర్కిల్ టాక్.ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. 2025లో సంక్రాంతి కానుకగా ఈ సినిమా రానున్నట్టు వార్తలు తెరపైకి వస్తుండగా మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. పేరు లక్ష్మణ భేరి.. ఆదాయం చెప్పను తియ్.. ఖర్చు లెక్క జెయ్యన్.. రాజ్యపూజ్యం అన్ లిమిటెడ్..అవమానం జీరో అంటూ ఇప్పటికే ఆర్‌టీ75లో రవితేజ పాత్ర ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేశారు మేకర్స్.రవితేజ ఖాకీ అవతార్‌లో కనిపించిన విక్రమార్కుడు, క్రాక్ సినిమాలు కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచాయని తెలిసిందే. ఇప్పుడు మరోసారి పోలీసాఫీసర్‌గా కనిపించనుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

ఓ పీడ కలొచ్చుండాది జోగులా.. యాక్షన్ ప్యాక్‌డ్‌గా 'దేవర' రిలీజ్ ట్రైలర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న చిత్రం దేవర. నందమూరి అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తుండగా.. ఈ చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అరవింద సమేత వీర రాఘవ' వంటి బ్లాక్ బస్టర్ తరువాత ఎన్టీఆర్ సోలోగా వస్తుండటంతో ఈ మూవీపై ఇటు టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా వైడ్‌గా భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేయగా.. రికార్డు వ్యూస్‌తో యూట్యూబ్‌లో దూసుకుపోతుంది. అయితే నేడు ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ డైలాగ్స్, అబ్బురపరిచే యాక్షన్ సన్నివేశాలు ఉండడంతో మూవీ అభిమానులకు ఫుల్ మీల్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది.

ఓటీటీలోకి 'బాలు గాని టాకీస్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.?

తెలుగు ఓటీటీ వేదిక ఆహా మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో మన ముందుకు వచ్చింది. ఇప్పటికే కొత్త పోరడు, భామ కలాపం, కలర్ ఫోటో వంటి చిత్రాలను తెరకెక్కించిన ఈ సంస్థ తాజాగా మరో ఇంట్రెస్టింగ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆహా సమర్పణలో వస్తున్న తాజా చిత్రం బాలు గాని టాకీస్ . ఈ సినిమాకు విశ్వనాథన్ ప్రతాప్ దర్శకత్వం వహిస్తుండగా.. శివ రామ చంద్రవరపు , శరణ్య శర్మ హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ తేదీని మేకర్స్ ప్రకటించారు. అక్టోబరు 4 నుంచి ఈ మూవీ ఆహాలో స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ చిత్రంలో హీరో పేరు బాలు అని. అతడికి థియేటర్ ఉన్నట్లు అలాగే బాలకృష్ణకు వీరాభిమాని తెలుస్తుంది. బాలయ్య వీరాభిమాని అయిన బాలు జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది తెలియాలి అంటే సినిమా వచ్చే వరకు వెయిట్ చేయాలి. ఈ సినిమాను శ్రీనిధి సాగర్, పి రూపక్ ప్రణవ్ తేజ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రఘు కుంచె, సుధాకర్ రెడ్డి, వంశీ నెక్కంటి, సురేష్ పూజారి, శేఖర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న డేవిడ్ వార్నర్.. ఏ సినిమానో తెలుసా.?

ఆస్ట్రేలియా బ్యాటర్ డేవిడ్ వార్నర్ గురించి తెలుగు వారికి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును 2016లో విజేతగా నిలపడమే కాకుండా తెలుగువారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నాడు. ఇక కరోనా లాక్‌డౌన్ టైంలో టాలీవుడ్ మూవీస్ నుంచి డేవిడ్ భాయ్ చేసిన రీల్స్, టిక్ టాక్ వీడియోలు ఫుల్ వైరల్‌గా మారాయి. దీంతో అప్పట్లో డేవిడ్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వమని ఫ్యాన్స్ కూడా కోరుకున్నారు. ఇక రీసెంట్‌గా దర్శక దిగ్గజం రాజమౌళితో క్రెడ్ యాడ్ చేసి నవ్వులు పూయించాడు. ఇదిలావుంటే తాజాగా డేవిడ్ వార్నర్ ఒక టాలీవుడ్ సినిమా చేస్తున్నట్లు సమాచారం అందింది. రీసెంట్‌గా ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పుష్పలో నేను నటించట్లేదు కానీ ఒక తెలుగు సినిమా అయితే నేను చేస్తున్నా అంటూ చెప్పుకోచ్చాడు.అయితే డేవిడ్ వార్నర్ చేసే తెలుగు సినిమా ఏంటా అని అభిమానులు తెగ సెర్చ్ చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే డేవిడ్ వార్నర్ నటిస్తున్న సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్ అవుతుంది. టాలీవుడ్ నటుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం రాబిన్ హుడ భీష్మ సినిమా తర్వాత నితిన్ , వెంకీ కుడుముల కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా 2024 డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. అయితే ఈ సినిమాలోనే డేవిడ్ వార్నర్ నటిస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఒక డాన్ క్యారెక్టర్‌లో డేవిడ్ వార్నర్ కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

కథ విన్న తర్వాత నిద్రపోలేకపోయా.. అమరన్‌పై శివకార్తికేయన్



కోలీవుడ్ స్టార్ యాక్టర్ శివకార్తికేయన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రం అమరన్ టైటిల్‌తో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. విశ్వరూపం ఫేం రాహుల్ బోస్ విలన్‌గా నటిస్తున్నాడు.అమరన్ అక్టోబర్ 31న దీపావళి కానుకగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్‌లో శివకార్తికేయన్ మాట్లాడుతూ.. తాను అమరన్ కథ విన్న తర్వాత నిద్రపోలేకపోయానని.. అప్పుడే భారతీయ ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ కథను అందరికీ చెప్పాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. మిలటరీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో శివకార్తికేయన్ మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటిస్తున్నాడు. సరిహద్దులో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయి అశోక చక్ర అవార్డు పొందారు మేజర్ ముకుంద్ వరదరాజన్. ఈ చిత్రాన్ని రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఫిలిమ్స్ ఇండియా సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ప్రమోషన్స్‌లో సాయిపల్లవి సంప్రదాయ చీరకట్టులో మెరిసింది. నిర్మాత కమల్ హాసన్ కూడా మూవీ లవర్స్‌తో చిట్ చాట్ చేశాడు. ఇప్పటికే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమర జవాన్ల సేవలను స్మరించుకుంటూ అమరన్ మేకింగ్ వీడియోను షేర్ చేశారు మేకర్స్.

విడాకుల తర్వాత తొలిసారి కుమారుడితో.. పాండ్యా సంబురం చూశారా..!

న్యూదిల్లీ-నవభూమి: పొట్టి ప్రపంచ కప్ హీరో, భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపుత్రోత్సాహంలో మునిగిపోయాడు. ఎందుకో తెలుసా..? దాదాపు రెండు నెలల తర్వాత కుమారుడు అగస్త్యను కలిశాడు. నటాషా స్టాంకోవిక్‌తో విడాకుల తర్వాత పాండ్యా తన వారుసుడు అగస్త్యతో మొదటిసారి విలువైన సమయం గడిపాడు. ప్రస్తుతం ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.రెండు నెలల తర్వాత కన్నకొడుకును చూసిన పాండ్యా సంబురానికి హద్దే లేకుండా పోయింది. మురిపెంగా అగస్త్యను ఎత్తుకున్న పాండ్యా అతడిని ఆడిస్తూ తాను కూడా ఓ పిల్లాడై పోయాడు. అగస్త్యను ఎత్తుకొని మనసారా నవ్వుతూ తండ్రితనాన్ని ఆస్వాదించాడు.

టీ20లు అస్సలు నచ్చవు.. నాకు ఇష్టమైన ఫార్మాట్ అదే..!

న్యూదిల్లీ-నవభూమి ఈ కాలపు విధ్వంసక ఓపెనర్లలో ట్రావిస్ హెడ్‌ఎంత ప్రమాదకరమో తెలిసిందే. క్రీజులో ఉన్నంతసేపు తుఫాన్‌లా చెలరేగే అతడు స్కోర్‌బోర్డును రాకెట్ వేగంతో ఉరికిస్తాడు. తాజాగా ఇంగ్లండ్‌పై కూడా ఈ డాషింగ్ బ్యాటర్ సుడిగాలి ఇన్నింగ్స్‌లతో అదరగొడు తున్నాడు. అన్నిరకాల షాట్లతో అలరించే హెడ్‌కు ఇష్టమైన ఫార్మాట్ ఏదో తెలుసా.. టెస్టులే. అవును.. ఈ విషయాన్ని అతడే స్వయంగా వెల్లడించాడు.
ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో శతకంతో మెరిసిన హెడ్ మ్యాచ్ అనంతరం.. 'నాకు టీ20ల కంటే టెస్టు ఫార్మాట్ అంటేనే ఇష్టం' అని చెప్పేశాడు. పొట్టి ఫార్మాట్‌లో పెట్రేగిపోయే అతడేనా ఆ మాట అన్నది అని ఆశ్చర్యపోతున్నారా? అయితే.. ఇది చదవాల్సిందే. 'నేను టీ20ల కంటే టెస్టు క్రికెట్ ఆడడాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తాను. టెక్నిక్, పరిస్థితులు.. ఇలా ఏ కోణంలో చూసినా సరే అది చాలా కష్టమైన ఫార్మాట్. టీ20 ఫార్మాట్ దాని కంటే జఠిలమైనది.

టెస్టుల్లో అశ్విన్ మరో ఘనత.. షాక్‌లో ఆస్ట్రేలియా లెజెండ్

న్యూదిల్లీ-నవభూమి సుదీర్ఘ ఫార్మాట్‌లో మ్యాచ్ విన్నర్‌గా పేరొందిన రవిచంద్రన్ అశ్విన్ మరోసారి తన మ్యాజిక్ చూపించాడు. తనకు అచ్చొచ్చిన చెపాక్ టెస్టులో బంగ్లాదేశ్ బ్యాటర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించాడు. మొదట బ్యాటుతో సెంచరీ కొట్టేసిన అతడు.. ఆ తర్వాత ఆరు వికెట్లతో చెలరేగిన తీరు అమోఘం. సంచలన బౌలింగ్‌తో టీమిండియాను విజయ పథాన నడిపిన అశ్విన్ వ్యక్తిగతంగా మరో ఘనత సాధించాడు.ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2024-25లో అత్యధిక సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనతో రికార్డు నెలకొల్పాడు. తన పోటీదారుడు అయిన ఆస్ట్రేలియా లెజెండ్ నాథన్ లియాన్‌కు అశ్విన్ భారీ షాకిచ్చాడు. సొంతమైదానం అయిన చెపాక్‌లో అశ్విన్ తన తడాఖా చూపించాడు. తొలి రోజు సెంచరీతో జట్టును ఆదుకున్న అశా భాయ్.. రెండో ఇన్నింగ్స్‌లో 688తో బంగ్లాదేశ్‌ను బెంబేలెత్తిం చాడు. దాంతో, డబ్ల్యూటీసీ 2024-25 సైకిల్‌లో 11వసారి అతడు ఐదు వికెట్ల ప్రదర్శ నర చేశాడు. ఆసీస్ దిగ్గజ స్పిన్నర్ లియన్ 10 పర్యాయాలు ఈ ఘనత సాధించాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**